PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 286 | విజయవాడ, మంగళవారం 21 మే 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 21 May 2024 | Rs

భూ యజమానికి నోటీసులు ఇవ్వకుండా రికార్డుల్లో మార్పులు చెల్లవు


- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

2

రైజర్స్‌తో రైడర్స్ పై

- నేడు ఐపిఎల్ తొలి క్వాలిఫయర్ పోరు
- ఫైనల్లో చోటు కోసం తొలి ప్రయత్నం

6



దర్యాప్తు లోపభూయిష్టం

ఎన్నికల హింసపై డిజిపికి సిట్ నివేదిక

- 33 చోట్ల హింసాత్మక ఘటనలు
- 1370మంది నిందితులు
- పలు కేసుల్లో ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు మార్పునకు ప్రతిపాదన



డిజిపి హరీష్‌కుమార్ గుప్తాకు నివేదికను అందజేస్తున్న సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలపై జరిగిన పోలీస్ దర్యాప్తులో అనేక లోపాలు చోటుచేసుకున్నట్లు సిట్ నిర్ధారించింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ , డిజిపి హరీష్‌కుమార్ గుప్తాకు సోమవారం అందించారు. 150 పేజీల ఈ నివేదికలో అల్లర్లు, హింసకు సంబంధించిన కేసుల దర్యాప్తులో అనేక లోపాలున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి అనేక అంశాలను వివరించారు. వీటిన కూడా పరిగణలోకి తీసుకుని ఎఫ్ఐఆర్‌లో మరికొన్ని సెక్షన్లు చేర్చాలని ప్రతిపాదించారు. ఏయే సంఘటనల్లో ఏయే సెక్షన్లు చేర్చవచ్చో కూడా వివరించినట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా ఆయా ప్రాంతాల్లో సంఘటన ఎలా జరిగింది? ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులెవరు? సంఘటన జరగకుండా ముందస్తుగా ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారు? సంఘటన జరుగుతున్న సమయంలో అల్లర్లు జరగకుండా తీసుకున్న చర్యలేమిటీ? ఘటనలకు సంబంధించి ఎన్ని ఎఫ్ఐఆర్‌లు చేశారు? ఏయే సెక్షన్లు వేశారు? అసలైన నిందితులను కేసులో పెట్టారా? లేక రాజకీయ వత్తిళ్లకు లొంగి వారిచ్చిన పేర్లను కేసుల్లో ఇరికించారా? లాంటి విషయాలన్నింటిని స్థానికులు, పోలీసులనుంచి వివరాలు రాబట్టిన సిట్ ఆ అంశాలను కూడా నివేదికలో పొందుపరిచింది. పల్నాడు , అనంతపురం, తిరుపతి మూడు జిల్లాల్లో ఈ సంఘటనలకు సంబంధించి 33 కేసులు నమోదయ్యాయని, వీటిలో మొత్తం మిగతా 2లో

మూడు జిల్లాల్లో నమోదైన కేసుల వివరాలు :

అసెంబ్లీ	కేసులు	నిందితులు	గుర్తించిన వారు	గుర్తించాల్సిన వారు	అరెస్ట్‌లు	అరెస్ట్‌లు చేయాల్సిన వారు	41-ఎ నోటీస్ ఇచ్చిన వారు
పల్నాడు జిల్లా							
నరసరావుపేట	10	178	116	62	0	140	38
మాచర్ల	08	296	51	245	0	267	29
గురజాల	04	107	107	0	19	64	24
మొత్తం:	**22**	**581**	**274**	**307**	**19**	**471**	**91**
తిరుపతి జిల్లా							
చంద్రగిరి	02	37	37	0	1	36	0
తిరుపతి	02	24	24	0	13	11	0
మొత్తం:	**04**	**61**	**61**	**0**	**14**	**47**	**0**
అనంతపురం జిల్లా							
తాడిపత్రి	07	728	396	332	91	634	3

మతోన్మాదం దేశ సమైక్యతకు ప్రమాదం

- అధికారం కోసం ప్రజల మధ్య బిజెపి చిచ్చు
- సుందరయ్య స్మారకోపన్యాసంలో బివి రాఘవులు



సుందరయ్య స్మారకోపన్యాసం చేస్తున్న బివి రాఘవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ సమైక్యతకు మతోన్మాదం అత్యంత ప్రమాదకరమని సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బివి రాఘవులు అన్నారు. మతోన్మాదానికి బిజెపి ప్రాతినిధ్యం వహిస్తోందని, దీని వెనుక ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ శక్తులు ఉన్నాయని చెప్పారు. మతం, కులం, రంగు, ప్రాంతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నిస్తోందని చెప్పారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా 'దేశ సమైక్యత-ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై స్మారకోపన్యాసం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబివికె) ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి మధు అధ్యక్షత వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే దేశసమైక్యతకు ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. మతం, కులం, ప్రాంతం, రంగు వంటి అంశాలను ప్రస్తావించి ప్రజల మధ్య చిచ్చుపెట్టి తద్వారా ప్రస్తుత ఎన్నికల్లో లబ్ధిపొందాలని నరేంద్రమోడీ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. మతానికి జనాభా పెరుగుదలకు సంబంధం లేదని, కానీ దేశంలో ముస్లిం జనాభా పెరుగుతోందని అర్థం లేని ఆరోపణలు చేస్తూ ప్రజల మధ్య విద్వేషం పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 140 కోట్ల జనాభాను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లలేని నరేంద్రమోడీ ప్రపంచాన్ని మించే సూపర్ పవర్‌గా దేశాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించారు. గతంలో దేశంలో విచ్ఛిన్నవాదం వచ్చిందని, మరలా అలాంటి పరిస్థితులను చొప్పించాలని బిజెపి మతోన్మాదులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

మతం వ్యక్తిగత జీవితంలో తప్ప సామాజిక జీవితంలో ఉండకూడదని లౌకిక వాదాన్ని రాజ్యాంగంలో పొందుపరుచుకున్నామని వివరించారు. రాజ్యాంగాన్ని మార్చి లౌకికవాదం అనే పదం తొలగించి హిందూ రాజ్యంగా మార్చేందుకు బిజెపి 400 లోక్‌సభ సీట్లు అడుగుతుందన్నారు. లౌకికవాదం తొలగిస్తే దేశం ఐక్యంగా ఉండటం సాధ్యం కాదన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టే ఏకరూప పౌరస్మృతి, సిఎఎ వంటి చట్టాలను ఇప్పటికే మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రాజకీయాలను మతం శాసించాలనే మైనార్టీ సంస్థలు కూడా ఉన్నాయని అన్నారు. మెజార్టీ మతోన్మాదాన్ని చూపించి మైనార్టీలు లౌకికవాదం వైపు రాకుండా మతంవైపే ఉండేలా కొన్ని మైనార్టీ సంస్థలు రెచ్చగొడుతున్నాయని తెలిపారు. మెజార్టీ మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ మైనార్టీ మతోన్మాదాన్ని ప్రశ్నించాలని, అప్పుడే లౌకికవాదం సాధ్యమవుతుందన్నారు. ముస్లిం రిజర్వేషన్లను ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు కేటాయిస్తామని మోడీ అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కుల వ్యవస్థను రద్దు చేయాల్సిన ప్రధాని మోడీ కులతత్వాన్ని ప్రోత్సహించేలా ఉపన్యాసాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా, ఏ రూపంలో నైనా మతోన్మాద అంశాలను ప్రోత్సహించినా అది జాతి ఐక్యతకు నష్టమన్నారు. హిందూ పేరుతో అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించేలా మోడీ ప్రయత్నిస్తున్నారనే, కార్పొరేట్ చేతుల్లో ఉన్న బడా మీడియా మోడీకి మద్దతుగా ఉన్నాయని చెప్పారు. భూ లావాదేవీలు ఎక్కడి నుంచైనా జరగాలనే ఆలోచనతో ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారని చెప్పారు. జగన్, చంద్రబాబు ఇద్దరూ మోడీ పక్కనే ఉన్నారని అన్నారు. జాతీయ సమైక్యత కోసం అనేక మంది స్వాతంత్ర సమరయోధులు ప్రాణాలు అర్పించారని, లక్షలమంది త్యాగాలు చేశారని చెప్పారు. ఆ త్యాగాలను వృధా పోనివ్వకుండా కాపాడుకునేందుకు పోరాడటమే సుందరయ్యకు నివాళులర్పించుకోవడం అని చెప్పారు. మధు మాట్లాడుతూ సుందరయ్య దేశ సమైక్యత కోసం తీవ్రమైన కృషి చేశారని చెప్పారు. మతం, కులం పేరుతో అనైక్యత సృష్టించే ప్రయత్నం రాష్ట్రంలో కూడా జరుగుతుందన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ప్రకటిస్తే అమలాపురంలో తీవ్రమైన అల్లర్లు జరిగాయని చెప్పారు. సామ్రాజ్యవాదానికి, వలస అధిపత్యానికి వ్యతిరేకంగా జాతీయ ఐక్యత ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి పి మురళీకృష్ణ, బాధ్యులు స్వరూపరాణి, క్రాంతికిరణ్, రామరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు 'సేవ్ వాటర్' పేరుతో విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది.

ఐదో దశలో 59 శాతం

- బెంగాల్‌లో73.14శాతం.. మహారాష్ట్రలో 53.5శాతం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల అయిదవ విడత పోలింగ్ పేలవంగా జరిగింది. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 49 లోక్‌సభ నియోజక వర్గాలకు, ఒడిశా అసెంబ్లీకి సోమవారం పోలింగ్ నిర్వహించారు. కడపటి సమాచారం ప్రకారం 59 శాతం ఓట్లు పోలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 73.14 శాతం, మహారాష్ట్రలో అత్యల్పంగా 53.5 శాతం ఓట్లు పోలయ్యాయి. బీహార్‌లో 53.7 శాతం, జార్ఖండ్‌లో 63 శాతం, ఒరిస్సాలో 60.72 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 57.79 శాతం, జమ్మూకాశ్మీర్‌లో 54.49 శాతం, లఢక్‌లో 67.15 శాతం పోలింగ్ నమోదైంది.

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ యుపిలోని రాయబరేలి నియోజక వర్గంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని బరాక్‌పూర్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి, ఎంపి అర్జున్ సింగ్‌కు టిఎంసి కార్యకర్తలు నల్లజెండా చూపించి నిరసన తెలిపారు. ఐదు దశల్లో 428 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పూర్తయింది.

తరలివచ్చిన సినీ తారలు, కార్పొరేట్ దిగ్గజాలు

ఐదో దశ పోలింగ్‌లో సినీ తారలు, కార్పొరేట్ దిగ్గజాలు, క్రీడాకారులు, రాజకీయ ప్రముఖులు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్, టాటా గ్రూప్ అధినేత రతన్‌టాటా, మహీంద్ర చైర్మన్ ఆనంద్ మహీంద్ర, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేష్ అంబానీ, ఛైర్‌పర్సన్ నీతూ అంబానీ, ఆదిత్య బిర్లా చైర్మన్ కుమార్ మంగళం బిర్లా, హెచ్‌డిఎఫ్ సి చైర్మన్ దీపక్ పరిక్, జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేష్ గోయల్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటులు సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్, అమిర్ ఖాన్, కిరణ్‌రావ్, సైఫ్ అలీ ఖాన్, రణవీర్ సింగ్, దీపికా పదుకొనే, రణబీర్ కపూర్, సన్నీ డియోల్, బాబీ డియోల్, అమితాబ్ బచ్చన్, ఎంపి జయా బచ్చన్, యాక్టర్స్ తమన్నా భాటియా, జాన్వీ కపూర్, సారా అలీ ఖాన్, శిల్పా శెట్టి, షమితా శెటా?న్, అమ్రిత సింగ్, కరీనా కపూర్, రచయిత జావేద్ అక్తర్, నటి షబానా అజ్మీ, నటులు జాకీ భగ్నానీ, ఆయన భార్య, నటి రకుల్ ప్రీత్ సింగ్, దర్శకుడు డేవిడ్ ధావన్, నటుడు వరుణ్ ధావన్, నటుడు కొంకణా సేన్ శర్మ, నటుడు, దర్శకుడు అర్బాజ్ ఖాన్, సంజయ్ దత్, అక్షయ్ కుమార్, అనిల్ కపూర్, హృతిక్ రోషన్, రాకేష్ రోషన్ తదితర ప్రముఖులు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. బిఎస్‌పి అధినేత్రి మాయావతి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాకరే, మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే తన కుటుంబాలతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రేవ్ పార్టీ కలకలం



- తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ, సినీ ప్రముఖులు?
- పోలీసుల అదుపులో 100 మంది
- కాకాణి స్టిక్కర్‌తో కారు!
- సంబంధం లేదన్న మంత్రి

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

బెంగళూరులో జరిగిన ఒక రేవ్ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. ఈ పార్టీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలకు చెందిన పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, వారి కుటుంబాలకు చెందిన వారు ఉండటమే దీనికి కారణం. అధికారికంగా పేర్లు వెల్లడించకపోవడంతో పోలీసుల అదుపులో ఉన్నారంటూ పలువురి పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. రేవ్‌పార్టీ వద్ద రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్ స్టిక్కర్ తో ఉన్న ఒక కారు దొరికినట్లు ఎలక్ట్రానిక్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారమైంది. దీనిని ఆయన ఖండించారు. ఆ కారుతో తనకు సంబంధంలేదని, స్టిక్కర్ అసలైనదా, కాదా అన్నది పోలీసులు తేలుస్తారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఆ వాహనంలో ఒక పాస్‌పోర్టు కూడా దొరికిందని చెబుతున్నారు. ఆ పాస్‌పోర్టు ఎవరిదన్న విషయాన్ని పోలీసులు ప్రకటించలేదు.

ఏం జరిగింది?

బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని ఒక ఫామ్‌హౌస్‌లో ఆదివారం రాత్రి ఒక బర్త్‌డే పార్టీ పేరుతో రేవ్‌పార్టీని నిర్వహించినట్లు పోలీసులు చెబుతున్నారు. పార్టీ తెల్లవారుజామున మూడు వరకు కొనసాగడంతో బెంగళూరు నగర క్రైమ్ బ్రాంచ్ పోలీసులు పక్కా వ్యూహం ప్రకారం దాడి చేశారు. బృందాలుగా విడిపోయి జరిపిన దాడిలో మద్యంతో పాటు, పెద్దఎత్తున డ్రగ్స్, కొకైన్ , ఎండిఎంఎ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వాసు అనే వ్యక్తి ఈ పార్టీ ని నిర్వహించారని, హైదరాబాద్ కాన్‌కార్డు సంస్థ గోపాల్‌రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. మొత్తం వందమందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా వారిలో 25 మంది యువతులున్నారు.

విమానంలో తరలింపు

ఈ పార్టీ కోసం యువతీయువకులను విమానంలో తరలించినట్లు పోలీసులు నిర్ధారించారు. హాజరైన వారిలో పలువురు ఖరీదైన కార్లలో వచ్చారు.సంఘటన స్థలంలో 15 విలువైన కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

హేమ... శ్రీకాంత్ ఉన్నారా...?

ఈ పార్టీలో సినీ నటి హేమ ఉన్నట్లు మీడియాలో ప్రసారమైంది. దీనిని ఆమె ఖండించారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. అయితే, ఈ వీడియో విడుదలైన కాసేపటికే హేమ పార్టీలో పాల్గొన్నట్లు బెంగళూరు పోలీసులు ఒక ప్రకటన విడుదల చేసినట్లు సమాచారం. ఇదే విధమైన ప్రచారం శ్రీకాంత్‌పై కూడా జరిగింది. ఆయన కూడా దీనిని ఖండించారు. తానెప్పుడు అటువంటి పార్టీలకు వెళ్లలేదని, ఆ సంస్కృతి తనది కాదని పేర్కొన్నారు. జానీ మాస్టర్ పై కూడా ఇటువంటి ప్రచారమే జరగ్గా ఆయన కూడా ఖండించారు.

'వారి' స్థానంలో నూతన డిఎస్‌పిల నియామకం

- పలువురు ఇతర పోలీస్ అధికారులు కూడా

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

పోలింగ్ సందర్భంగా రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనల్లో వేటుపడ్డ డిఎస్‌పిల స్థానంలో నూతన డిఎస్‌పిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎన్నికల సంఘం నుండి అందిన ఆదేశాల మేరకు ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లా నర్సారావు పేట డిఎస్‌పిగా ఎం. సుధాకర్ రావును నియమిస్తూ ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం ఆయన పల్నాడు జిల్లా దిశా డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. అలాగే గురజాల డిఎస్‌పిగా సిహెచ్ శ్రీనివాసరావును నియమించింది. ఈయన ప్రస్తుతం కాకినాడ ఎస్‌సి,ఎస్‌టి సెల్ డిఎస్‌పిగా పని చేస్తున్నారు. తిరుపతి డిఎస్‌పిగా కె.రవిమనోహర ఆచారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఈయన ఎసిబి డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. అలాగే మరో ఎసిడి డిఎస్‌పి మిగతా 2లో

ఛత్తీస్‌గఢ్‌లో దారుణం

- వాహనం లోయలో పడి 18 మంది దుర్మరణం

యుద్ధనేరాల ప్రభువు నెతన్యాహు అరెస్టుకు వారెంట్ ఇవ్వండి

- ఐసిసిని కోరిన చీఫ్ ప్రాసిక్యూటర్
- 24గంటల్లో వందమందికి పైగా పాలస్తీనియన్లు మృతి

లోపలి పేజీలో..

విత్తుకై వెతుకులాట

- అందని పంటల బీమా
- తొలకరితో సాగుకు సమాయత్తమవుతున్న 'అనంత' రైతన్న



వేరుశనగకాయలు ఒలుచుతున్న రైతులు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

తొలకరి పలకరించడంతో అనంత రైతన్న సాగుకు సమాయత్తమవుతున్నాడు. ఖరీఫ్ వచ్చే నెల ప్రారంభం కానుంది. ఈలోపు విత్తనాలు సిద్ధం చేసుకోవడం, దుక్కులు దున్నుకోవడం వంటి పనులకు సిద్ధమవుతున్నాడు. ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల పంపిణీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించింది. ఈ నెల 24 నుంచి విత్తనకాయల పంపిణీని చేపట్టనున్నట్లు ప్రకటించింది. విత్తనాలు తీసుకునేందుకు ముందుగా రిజిస్ట్రేషన్‌తోపాటు నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. దుక్కులకు డబ్బులు అవసరమవుతాయి. గతేడాది వర్షాభావంతో పంటలు పండక రైతులు పూర్తిగా నష్టపోయారు. చేతిలో చిల్లిగవ్వలేక డబ్బుల కోసం వెతుకులాట మొదలు పెట్టారు. బ్యాంకుల్లో రుణాలు ఇస్తున్నా అవి గతేడాది రుణాలు చెల్లించి పాతవి రెన్యువల్ చేసుకోవడానికి సరిపోతున్నాయి. కొత్తగా పెట్టుబడికి చేతిలో డబ్బుల్లేక బయట వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

అందని పంటల బీమా, రైతు భరోసా

2023 ఖరీఫ్‌లో వర్షాభావంతో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లింది. అనంతపురం జిల్లాలో 29 మండలాల్లో పంట నష్టం జరిగింది. కేంద్ర కరువు బృందంతోపాటు, జిల్లా అధికార యంత్రాంగం రూపొందించిన పంట నష్టం అంచనాలే 4.34 లక్షల ఎకరాల్లో గతేడాది ఉంది. ఇందుకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం రూ.251.20 కోట్లు మంజూరు చేసింది. పంటల బీమాపై ఇప్పటి వరకు ప్రకటన వెలువడలేదు. ఇది ఇప్పటికైనా వస్తే రైతులకు పెట్టుబడికి ఉపయోగపడుతుందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. 2024కు సంబంధించి మేలో ఏటా ఇస్తున్న రైతు భరోసా కూడా ఇప్పటి వరకు ఏమిటన్న స్పష్టత అధికారులకే లేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దీనిపై ఎటువంటి మార్గదర్శకాలూ లేవు. ఏటా మేలో ఆన్‌లైన్‌లో రైతు భరోసా నమోదుకు ఆప్షన్ ఇవ్వగానే అధికారులు నమోదు చేసే వారు. ఈసారి ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఓపెన్ అవలేదని మిగతా 2లో

హెలికాప్టర్ ప్రమాదంలో రైసీ మృతి



- ధ్రువీకరించిన ఇరాన్
- ప్రపంచ నేతల సంతాపం
- తాత్కాలిక అధ్యక్షుడిగా మొఖ్బర్
- ఇజ్రాయిల్ పాత్రపై అనుమానాలు!

టెహ్రాన్: ఆదివారం నాటి హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణించారు. హెలికాప్టర్‌లో ఆయనతోబాటు వెళ్లిన విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీర్ అబ్దుల్లా హియాన్, తూర్పు అజర్‌బైజాన్ ప్రొవిన్స్ గవర్నరు, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ విషాదకర ఘటనలో చనిపోయినట్లు ప్రభుత్వ మీడియా సోమవారం ధ్రువీకరించింది. అజర్‌బైజాన్ సరిహద్దుల్లోని వర్జాఘన్ పర్వత శ్రేణుల్లో కూలి దగ్ధమైన హెలికాప్టర్ శకలాలకు సంబంధించిన దృశ్యాలను ఇరాన్ టివి ప్రసారం చేసింది. హెలికాప్టర్‌లో మొత్తం తొమ్మిది మంది ఉండగా ఒక్కరు కూడా జీవించి లేరని తెలిపింది. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం చనిపోయిన అధ్యక్షుడు రైసీ స్థానంలో తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రథమ ఉపాధ్యక్షుడు మహ్మద్ మొఖ్బర్ (68)ను ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీ సోమవారం నియమించారు. తాత్కాలిక అధ్యక్షుడు, పార్లమెంటు స్పీకర్, సుప్రీం కోర్టు చీఫ్‌లతో కూడిన త్రిసభ్య మండలి 50 రోజుల్లోగా అధ్యక్ష పదవికి తిరిగి తాజాగా ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. తాత్కాలిక విదేశాంగ మంత్రిగా ఇరాన్ అణు చర్చల సంధానకర్త అలీ బగ్చేరిని నియమించారు. విదేశాంగ విధానం, అణు బటన్ నియంత్రణ వంటి కీలకమైన అధికారాలు సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేని వద్దే ఉంటాయి. ఆయనకు కాబోయే వారసుడిగా ప్రచారంలో ఉన్న రైసీ దుర్మరణం పాలవడంతో, రాజ్యాంగ బద్ధంగానే ఉపాధ్యక్షుడు మొఖ్బర్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అధ్యక్షుని కాన్వాయ్‌లో భాగంగా వెళ్లిన రెండు హెలికాప్టర్లు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకున్నట్లు ఇరానియన్ మీడియా తెలిపింది. ఇటీవల ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఘర్షణలు మిగతా 2లో

తిరుమలలో చిరుతపులుల కలకలం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో మరోసారి రెండు చిరుత పులుల సంచారం కలకలం రేపింది. అలిపిరి నడకదారిలోని ఆఖరి మెట్టు వద్ద సోమవారం సాయంత్రం చిరుతలను చూసి యాత్రికులు కేకలు వేశారు. దీంతో రెండు చిరుతలు అడవిలోకి పారిపోయాయని యాత్రికులు తెలిపారు. సమాచారం అందుకున్న టిటిడి విజిలెన్స్ అధికారులు ఘటనాస్థలికి చేరుకున్నారు. పులి జాడల కోసం అన్వేషించారు. అయితే ఆ సమయంలో చినుకులు పడడంతో ఎటువంటి గుర్తులు కనిపించలేదు. అప్రమత్తమైన టిటిడి అధికరులు యాత్రికులను గుంపులు గుంపులుగా పంపుతున్నారు.

ఎపి చెస్ అసోసియేషన్ గుర్తింపు వ్యవహారంపై నిర్ణయం తీసుకోండి

- ఆలిండియా చెస్ సమాఖ్యకు హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

ఎపి చెస్ అసోసియేషన్‌కు గుర్తింపు ఇచ్చే అంశంపై ఆరు వారాల్లోగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆలిండియా చెస్ సమాఖ్య కార్యదర్శికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ క్రీడల కోడ్ నిబంధనలకు లోబడి సమాఖ్య నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తీర్పు చెప్పారు. తమ అసోసియేషన్ గుర్తింపును ఆలిండియా చెస్ సమాఖ్య రద్దు చేయడాన్ని ఎపి చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుమన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు, పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకొని గుర్తింపు విషయంలో చట్ట ప్రకారం తగిన ఉత్తర్వులు జారీ చేయాలంది. గత ఫిబ్రవరిలో ఉత్తర్వుల తర్వాత సమాఖ్య తీసుకోకపోవడాన్ని ఆక్షేపించింది. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన జాతీయ క్రీడల కోడ్ గైడ్‌లైన్స్ ప్రకారం అన్ని రాష్ట్రాల అసోసియేషన్లకు గుర్తింపు ఇవ్వాల్సిన చట్టబద్ధ బాధ్యత సమాఖ్యదేనని గుర్తు చేసింది. ఆరు వారాల్లోగా సమాఖ్య నిర్ణయం తీసుకుని తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

తెలంగాణ ఇ సెట్‌లో 95.86 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో రెండో ఏడాదికి లాటరల్ ఎంట్రీ ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ ఫలితాలను హైదరాబాద్‌లో సోమవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. ఈసెట్‌కు 24,272 మంది దరఖాస్తు చేయగా, 23,330 మంది పరీక్ష రాశారు. వారిలో 22,365 (95.86 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అబ్బాయిలు 16,293 మంది దరఖాస్తు చేస్తే, 15,643 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 14,892 (95.20 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 7,979 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 7,687 మంది పరీక్ష రాశారు. వారిలో 7,473 (97.22 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఈసెట్‌లో అబ్బాయిల కంటే అమ్మాయిలు 2.02 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత పొందారు. 11 కోర్సులకు ఈసెట్ రాతపరీక్ష నిర్వహించారు. అత్యధికంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ) విభాగానికి 6,197 మంది దరఖాస్తు చేయగా, 6,002 మంది పరీక్ష రాశారు. వారిలో 5,892 (98.17 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగానికి 5,616 మంది దరఖాస్తు చేస్తే, 5,407 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 4,889 (90.42 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)కి 4,302 మంది దరఖాస్తు చేస్తే, 4,131 మంది పరీక్ష రాశారు. వారిలో 4,057 (98.21 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. సివిల్ ఇంజినీరింగ్‌కు 3,774 మంది దరఖాస్తు చేయగా, 3,609 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 3,496 (96.87 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మెకానికల్ ఇంజినీరింగ్‌కు 3,469 మంది దరఖాస్తు చేస్తే, 3,340 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 3,221 (96.44 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. అత్యల్పంగా బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుకు 48 మంది దరఖాస్తు చేయగా, పది మంది పరీక్ష రాశారు. వందశాతం ఉత్తీర్ణత పొందారు. ఈ కార్యక్రమంలో ఒయు విసి డి రవీందర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ఈసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'వారి' స్థానంలో నూతన డిఎస్‌పిల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

ఎం. వెంకటాద్రిని తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పిగా నియమించారు. ఏలూరు ఎస్ఈబి డిఎస్‌బిగా విధులు నిర్వర్తిస్తున్న కె. జానార్ధన నాయుడును అనంతపురం జిల్లా తాడిపత్రి డిఎస్‌పిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరితోపాటు శ్రీసత్యసాయి జిల్లాలో విఆర్‌లో లో ఉన్న ఎం.రామారావును అలిపిరి సిఐగా, అనంతపురం విఆర్‌లో ఉన్న ఎ.విశ్వనాథ్ చౌదరిని తిరుపతి స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బి) సిఐగా, తాడిపత్రి సిఐగా పి.నాగేంద్రప్రసాద్‌ను నియమించారు. పల్నాడు స్పెషల్ బ్రాంచ్ సిఐలుగా బండారు సురేష్‌బాబు, యు.శోభన్‌బాబు, కారెంపూడి ఎస్ఐగా కె. అమీర్, నాగార్జున సాగర్ ఎస్ఐగా ఎం. పట్టాభిని నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది.

పడిపోయిన నీటి నిల్వలు

- పులిచింతలలో టిఎంసి కన్నా తక్కువ నిల్వ
- సాగర్‌లో డెడ్ స్టోరేజీ కన్నా దిగువకు తగ్గుదల

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు దారుణంగా పడిపోయాయి. ఆల్మట్టి నుంచి పులిచింతల వరకు కనీస నీటి నిల్వలు లేక జలాశయాలు వెలవెలబోతున్నాయి. గత ఎనిమిది నెలలుగా సరైన వర్షాలు లేక కృష్ణా పరివాహక ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడింది. ఈ ఏడాది వేసవిలో కురుస్తున్న వర్షాలతో నీటి ఎద్దడి నుంచి తాత్కాలిక ఉపశమనం ఉన్నా, సమస్య తీవ్రత ఏ మాత్రమూ తగ్గడం లేదు. ఎగువ నుంచి నీటి ప్రవాహం రాకపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలు పూర్తిగా దిగువ స్థాయికి పడిపోయాయి. శ్రీశైలం గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు కాగా, సోమవారం సాయంత్రానికి 32.38 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. నాగార్జున సాగర్ గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 312.01 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 123 టిఎంసిలకు పడిపోయాయి. పులిచింతలలో 45.77 గరిష్ట నీటిమట్టం టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.74 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. నాగార్జున సాగర్, శ్రీశైలంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. పులిచింతలలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. రానున్న రెండు నెలలు వేసవి కొనసాగే అవకాశం ఉండడంతో పలు జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడవచ్చు. కర్ణాటక, తెలంగాణలోని జలాశయాల్లో కూడా తగినంత నీటి నిల్వలు లేకపోవడంతో ఎగువ రాష్ట్రాలను సంప్రదించే అవకాశం లేకుండాపోయింది.


పులిచింతల ప్రాజెక్టులో ముప్పాడు టిఎంసిలు మాత్రమే ఉన్న నీటి నిల్వ

కర్ణాటకలోని నారాయణపూర్ జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 37.64 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 18.79 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. జూరాల జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 9.65 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 1.95 టిఎంసిలకు పడిపోయింది. ఆల్మట్టిలో గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 129.72 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 50 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. దీంతో, కృష్ణా పరివాహక ప్రాంతాలైన కర్నూలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ ఏడాది తాగునీటికి ఇబ్బందులు పొంచి ఉన్నాయి. ఇటీవల నాగార్జున సాగర్ నుంచి కుడి, ఎడమ కాల్వలకు పది టిఎంసిలను తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. ఇందులో గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలకు 5.5 టిఎంసిలు మాత్రమే విడుదలయ్యాయి. ప్రస్తుతం గ్రామాల్లో చెరువుల్లో కూడా పూర్తి స్థాయిలో నీటి నిల్వలు లేవు. పల్నాడు జిల్లాలోని దాదాపు 200 గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. గుంటూరు జిల్లాలో 80 గ్రామాలకు నీటి సరఫరా సక్రమంగా లేదు. కృష్ణా నది నుంచి నీరు సరిగా రాకపోవడంతో చాలా గ్రామాలకు రక్షిత నీటిపథకాల ద్వారా మూడు రోజులకు ఒకసారి మాత్రమే తాగు నీటిని విడుదల చేస్తున్నారు.

రుద్రవరంలో వర్ష బీభత్సం

- ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వాన
- పిడుగుపాటుకు వ్యవసాయ కార్మికుడు, 12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉపరితల ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. భారీ ఈదురుగాలులు వీశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. భారీ వృక్షాలు నేలకూలడంతో పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పిడుగుపాటుకు నంద్యాల జిల్లాలో 12 మూగజీవాలు మృత్యువాతపడ్డాయి.

నంద్యాల జిల్లా రుద్రవరం మండలంతో పాటు పలు గ్రామాలలో ఉరుములు, మెరుపులు, భారీ ఈదురు గాలులతో వర్ష బీభత్సం సృష్టించింది. రహదారులతో పాటు పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలివాన బీభత్సంతో వారపు సంతలో వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉరుములు, మెరుపులు, భారీ గాలివానతో గ్రామస్తులు భయాందోళన గురయ్యారు. వర్షపు నీరు రహదారిపై నిలిచిపోవడంతో రుద్రవరం, మహానంది ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పిడుగుపాటుకు రుద్రవరం మండలం ఆర్.కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు కొట్టాలపల్లి కాశీం సాహెబ్‌కు చెందిన 12 గొర్రెలు ఆదివారం రాత్రి మృతి చెందాయి. దాదాపు రూ 1.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం దంపెట్ల గ్రామానికి చెందిన జింకా చంద్రశేఖర్(55) ఉప్పర్లపల్లి-గరికలపల్లి గ్రామాల సమీపాన రైతు పొలంలో కూలి పనులు చేస్తుండగా వర్షం పడడంతో ఇంటికి బయలుదేరారు. అతని సమీపంలో పిడుగుపడడంతో షాక్‌కు గురై మరణించారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


రుద్రవరం మండలం కేంద్రంలో భారీ ఈదురుగాలులకు ఆటోపై నేలవాలిన విద్యుతు స్తంభం, చెట్టు

గుంటూరు జిల్లా నర్సరావుపేటలో ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ, గుంటూరు, చేబ్రోలు, తెనాలి, పెదకాకాని, భట్టిప్రోలు, కొల్లూరు, దుగ్గిరాల మండలాల్లో జల్లులతో కూడిన వర్షం కురిసింది. పల్నాడు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్‌లో పలుచోట్ల వర్షం కురిసింది. రోడ్లన్నీ వర్షపునీటితో జలమయమయ్యాయి. చింతూరులో భారీ ఈదురుగాలులతో ఎర్రంపేట, చట్టి గ్రామాల్లో పలు చెట్లు నెలకొరిగాయి. కొన్ని విద్యుత్ లైన్లపై పడడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వైసిపి తప్పుడు ప్రచారం

- టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అరాచకాలు సృష్టించిన వైసిపి నేతలు.. దాన్ని టిడిపి నేతలపై రుద్దేందుకు యత్నిస్తున్నారని నరసరావుపేట టిడిపి ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ఆరోపించారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడులో జరిగిన ఘటనలను టిడిపిపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పల్నాడు ఎస్‌పి బిందుమాధవ్‌కు, తమ కుటుంబానికి సంబంధాలున్నాయని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. 'ఎన్నికల సందర్భంగా నాపై దాడి చేశారు. నా వాహనాలను ధ్వంసం చేశారు. సిట్ పూర్తిగా విచారణ చేపట్టాలి. అందరి కాల్‌డేటా తీసుకోవాలి' అని అన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. తాడేపల్లి ప్యాలెస్ నుంచి సజ్జల రామకృష్ణారెడ్డి, ధనంజయరెడ్డి ఇచ్చే ఆదేశాలకనుగుణంగా సిఎస్ పనిచేస్తున్నారని, ఆయన ఆదేశాలకనుగుణంగా యంత్రాంగం నడుస్తోందని, అందుకే రాష్ట్రంలో ఎన్నికల తర్వాత అరాచకం తాండవించిందని విమర్శించారు. టిడిపి సీనియర్ నేత వర్ల రామయ్య మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో టిడిపి కండువా కప్పుకుని కులాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న వైసిపి నాయకులు మన్విత్ కృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై తాము సిఐడికి ఫిర్యాదు చేశామన్నారు.

హెలికాప్టర్ ప్రమాదంలో రైసీ మృతి

(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకున్న నేపథ్యంలో రైసీ హెలికాప్టర్ కూలిపోవడం వెనక ఇజ్రాయిల్ హస్తం ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో తమకెలాంటి ప్రమేయం లేదని ఇజ్రాయిల్ ప్రతినిధి ఒకరు చెప్పారు.

రైసీ మృతికి సంతాప సూచకంగా ఇరాన్ జాతీయ పతాకాన్ని అవనతం చేసి, ఐదు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించారు.

ప్రపంచ నేతల సంతాపం

హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఇబ్రహీం రైసీకి సంతాపం తెలియజేస్తూ భారత్, పాకిస్తాన్, రష్యా, చైనా, ఈజిప్ట్, ఫ్రాన్స్, టర్కీ, ఇరాక్, సిరియా, లెబనాన్, కతార్, మలేసియా, దక్షిణాఫ్రికా సహా పలుదేశాల నేతలు పలువురు సందేశాలు పంపారు. రైసి ఆకస్మిక మృతి తమను కలచివేసిందని మోడీ వ్యాఖ్యానించారు. ఇదొక విషాదకరమైన సంఘటన అని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. రష్యాకు నిజమైన మిత్రుడు రైసి అని పుతిన్ వ్యాఖ్యానించారు. ఈ విమాన ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేసే క్రమంలో తాము సాయపడేందుకు సిద్ధంగా వున్నామని రష్యా ప్రకటించింది. ఇరాన్ ప్రజలకు తమ సంఘీభావం వుంటుందని ఇరాక్ ప్రధాని షియా అల్ సుదాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యురోపియన్ యూనియన్ విదేశాంగ విధాన చీఫ్ జోసెఫ్ బోరెల్ కూడా తమ సంతాపాన్ని తెలియజేశారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరులో కీలకపాత్ర పోషించిన రైసీ

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే శక్తులను ఐక్యపరిచే కీలక నేతల్లో రైసీ ఒకరు. ఇరాన్ అణు కార్యక్రమంలోను, మధ్య, పశ్చిమాసియా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూ వచ్చారాయన. గాజాలో ఊచకోతకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. సిరియాలోని ఇరాన్ దౌత్య కార్యాలయంపై ఇజ్రాయిల్ వైమానిక దాడికి ప్రతీకారం తీర్చుకున్నారు.

అదే సమయంలో ఆయన దేశ ప్రజల ప్రయోజనాల కన్నా రక్షణ రంగతానికే అధిక ప్రాధాన్యత ఇచ్చేవారని, మత విశ్వాసాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రగతి శీల శక్తులపై నిర్బంధం ప్రయోగించారన్న విమర్శలు కూడా ఉన్నాయి.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ ఎన్‌వి రమణ

తరగతి గది నుండే విద్యార్థి జీవితం ప్రారంభం

- విద్య ద్వారానే గ్రామం నుండి దేశం వరకు అభివృద్ధి
- ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో జస్టిస్ ఎన్‌వి రమణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తరగతి గదిలో ప్రారంభమయ్యే విద్యార్థి జీవితం, చదువుకునే రోజుల్లోనే వారి జీవితం తిరోగమనమో, పురోగమనమో తేలిపోతుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కేసానుపల్లి పరిధిలో ప్రముఖ అనస్తీషియా వైద్యులు, మధర్ థెరిస్సా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగోతు ప్రకాశరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్థాపించిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ నేషనల్ ఫ్రాంచైజ్ అధిపతి సుభాష్ కలువ అధ్యక్షతన జరిగిన సభలో జస్టిస్ ఎన్.వి రమణ మాట్లాడుతూ నాణ్యమైన విద్య ద్వారానే గ్రామం నుండి దేశం వరకు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. పాఠశాల దశ ఎన్నో నేర్పిస్తుందని, మంచి అలవాట్లు, మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం విద్యార్థులకు పెరిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యా సంస్థలదేనన్నారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఎంత ఎదిగినా పుట్టి పెరిగిన ప్రాంతాన్ని, తల్లిదండ్రులను, గురువులను, వారి కష్టాన్ని మర్చిపోకూడదన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన పల్నాడులో లాభాపేక్షకు తావు లేకుండా విద్యాభివృద్ధి కోసం ఈ పాఠశాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

గ్రామీణ ప్రాంతానికి చెందిన తాను డాక్టర్‌గా ఎదిగానని, చదువు విలువ తెలుసని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చక్రధర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎన్ఎన్ రాజు, వి.వెంకట నరసయ్య, ఆర్‌డిఒ పి.సరోజిని, నరసరావుపేట జూనియర్ సివిల్ జడ్జి ఆనంద్‌పాల్, తిరుమల ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ, డాక్టర్ ఎన్.వెంకట్రావు, ఎన్.శౌరయ్య పాల్గొన్నారు.

విత్తుకై వెతుకులాట

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు చెబుతున్నారు.

ఖరీఫ్ అంచనా 8.66 లక్షల ఎకరాలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో అనంతపురం జిల్లాలో 8.66 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసే అవకాశముందని అంచనా వేశారు. వేరుశనగ పంట 4.94 లక్షల ఎకరాల్లో సాగుకు వీలుందని, పత్తి 1.12 లక్షల ఎకరాలు, కంది 9,233 ఎకరాలు, ఆముదం 40,376 ఎకరాలు, మొక్కజొన్న 28,549 ఎకరాలు, నీటి వసతి కింద 1,13,040 ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశముందని అంచనా వేశారు.

ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ఇవ్వాలి

ఖరీఫ్ ప్రారంభానికి ముందే జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. రైతులు సాగుకు సమయత్తమవుతున్నారు. పెట్టుబడులకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం 2023 ఖరీఫ్ పంట నష్టానికి సంబంధించి పంటల బీమాను వెంటనే మంజూరు చేయాలి. ఎప్పటిలాగానే ఈసారీ రైతు భరోసా డబ్బులు జమచేయాలి.

-చంద్రశేఖర్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

దర్యాప్తు లోపభూయిష్టం

(మొదటి పేజీ తరువాయి)

1370మంది నిందితులుగా ఉన్నారని ఆ నివేదికలో పొందుపరిచారు. ఈ మొత్తం నిందితుల్లో ఇప్పటి వరకు 124మందిని అరెస్ట్ చేయగా, 1152మందిని అరెస్ట్ చేయాల్సి ఉందని, మరో94మందికి 41-ఎ కింద నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు.

ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు పలు కేసుల్లో నిందితుల జాబితా పెరిగే అవకాశమున్నట్లు స్పష్టమవుతోంది. వీరిలో పలువురు అజ్ఞాతంలో ఉండటంలో వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని కూడా సూచించినట్లు సమాచారం. దర్యాప్తులో లోపాలు స్పష్టం కావడంతో సంబంధిత పోలీస్ అధికారులపై వేటు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్‌తోపాటు 12 మందితో కూడిన ఈ దర్యాప్తు బృందంలో ఒక అడిషనల్ ఎస్‌పి, నలుగురు డిఎస్‌పిలు, ఏడుగురు పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, ఒక న్యాయసలహాదారుడుతో సహా 4 టీమ్‌లు పాల్గొన్నాయి. ఒక్కో టీమ్‌కు డిఎస్‌పి నేతృత్వం వహించారు. పల్నాడు జిల్లాకు రెండు బృందాలు, అనంతపురానికి ఒక బృందం, తిరుపతికి ఒక బృందాన్ని నియమించారు.

సిట్ బృందంతో సమన్వయంతో ముందుకు సాగాలి: డిజిపి

సిట్ బృందంతో సమన్వయం చేసుకుంటూ దర్యాప్తును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా సోమవారం సంబంధిత జిల్లాల ఎస్‌పిలు, ఎస్ఎస్‌పి, అనంతపురం డిఐజి, గుంటూరు ఐజిలను ఆదేశించారు.

భూ యజమానికి నోటీసులు ఇవ్వకుండా

రికార్డుల్లో మార్పులు చెల్లవు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

భూయజమానులకు నోటీసు ఇచ్చిన తర్వాత వాళ్ల వాదనలు విన్నాకే రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. భూయజమానికి నోటీసు ఇవ్వకుండా, వాదనలు వినకుండా మార్పులు, చేర్పులు చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. నిబంధనలను అమలు చేయకుండా రికార్డుల్లో మార్పులు చేయడం సబబుకాదని స్పష్టం చేసింది. చిన్నం పాండురంగం కేసులో హైకోర్టు గతంలోని తీర్పుకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు చేయడానికి వీల్లేదని పేర్కొంది. నెల్లూరు జిల్లా పరికోటకు చెందిన పిటిషనర్ల భూముల గురించి రికార్డుల్లో మార్పులు చేయడాన్ని తప్పుపట్టింది. రికార్డుల్లో మార్పులు చేసిన కలిగిరి మండల తహశీల్దార్ ఉత్తర్వులు చెల్లవని తెలిపింది. తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులను నిలుపుదల చేసింది. నెల్లూరు జిల్లా వరికోట గ్రామం సర్వే నెంబరు 227/1, 227/2లో తమ పేరున ఉన్న భూములను సమగ్ర భూరీసర్వే పేరుతో ప్రభుత్వ భూములుగా మార్చారంటూ కోట మహేశ్వరరెడ్డి, మరొకరు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. 1961 నుంచి ఆరు ఎకరాలకు పైగా భూమి తమ స్వాధీనంలో ఉందని పిటిషనర్ల వాదన. తమ భూములను మూడో వ్యక్తి పేరిట మార్చారంటూ పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన పి.సత్య నాగేంద్రప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా హైకోర్టు విచారించింది. ఈ కేసులను విచారించిన జస్టిస్ ఎస్ సుబ్బారెడ్డి ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. సమగ్ర విచారణ వేసవి సెలవుల తర్వాత చేపడతామని ప్రకటించారు.

పోలీసు బలగాల ఫ్లాగ్‌మార్చ్

- హైదరాబాద్‌లోనే జెసి ప్రభాకర్‌రెడ్డి
- తాడిపత్రిలో మాక్ డ్రిల్, ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి సోమవారం తన స్వగ్రామానికి వస్తున్నారని సోషల్ మీడియాలో రూమర్స్ వ్యాపించాయి. అయితే ఆయన హైదరాబాదులోనే ఉన్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. సిట్ అధికారులు సోమవారం ఉదయం తాడిపత్రి నుంచి వెళ్లిపోయారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే అప్రమత్తంగా ఉంటూ నిర్దేశిత సమయంలో ఘటనా స్థలానికి వెళ్లి చర్యలు తీసుకోగలుగుతారో పరీక్షించడానికి పోలీసు అధికారులు తాడిపత్రిలో మాక్ డ్రిల్, ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటలకు అలర్ట్‌నెస్‌ను పరీక్షించారు. అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షిమోషి, జిల్లా ఎస్‌పి గౌతమిశాలి ఆదేశాల మేరకు అదనపు ఎస్‌పిలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, డిఎస్‌పిలు బి.శ్రీనివాసులు, జి.శివభాస్కర్ రెడ్డి, బివి శివారెడ్డి, యు.నరసింగప్ప, శ్రావణ్ కుమార్ నేతృత్వంలో కేంద్రసాయుధ బలగాలు, ఎపిఎస్‌పి, ఎఆర్ సాయుధ పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని అశోక్ పిల్లర్ నుంచి బండామసీద్, చిన్న బజార్, కటికవీధి, సుంకులమ్మపాలెం, యల్లనూరు రోడ్డు సర్కిల్, పుట్లూరు రోడ్డు సర్కిల్ మీదుగా అర్బన్ పోలీసు స్టేషన్ వరకు ఈ కవాతు కొనసాగింది.

బాపట్ల జిల్లా ఎడ్ల జతకు ప్రథమ స్థానం

- రామపురంలో ఘనంగా పట్టాభిరామ స్వామి తిరుణాళ్ల

ప్రజాశక్తి-సిఎస్‌పురం (ప్రకాశం జిల్లా)

శ్రీపట్టాభిరామస్వామి తిరుణాళ్ల సందర్భంగా ప్రకాశం జిల్లా సిఎస్‌పురం మండలం రామాపురంలో ఎడ్ల పందాలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఈ పోటీలు జరిగాయి. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన ఐదు జతల ఎడ్లు ఇందులో పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలానికి చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్ల జత 15.89 అడుగులు లాగి రూ.50 వేల రూపాయల ప్రథమ బహుమతి సాధించాయి. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్ల జత 15.51 అడుగులు లాగి రూ.40 వేల ద్వితీయ బహుమతి పొందాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగా కాశయ్య ఎడ్ల జత 11.57 అడుగు లాగి రూ.30 వేల రూపాయల తృతీయ బహుమతి సాధించాయి. మిగతా రెండు జతలకు ప్రోత్సాహం కింద రూ.ఐదు వేల చొప్పున బహుమతి అందజేశారు.

సిట్‌ను కలిసిన వైసిపి ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా జరిగిన హింసపై దర్యాప్తు కొనసాగిస్తున్న స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను వైసిపి ప్రతినిధుల బృందం సోమవారం డిజిపి కార్యాలయంలో కలిసి పలు అంశాలపై ఫిర్యాదు చేసింది. సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్, ఆయన టీమ్‌ను మంత్రులు జోగి రమేష్, అంబటి రాంబాబు, మాజీ మంత్రులు పేర్ని నాని, రావెల కిషోర్‌బాబు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కైలే అనిల్ కుమార్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఆ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి కలిసి పలు అంశాలపై విచారణ చేయాలని కోరారు. తదనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి నేతలతో కొందరు పోలీసులు చేతులు కలిపారని, అందుకే పల్నాడు, తిరుపతి, అనంతపురంలో హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. టిడిపి పన్నిన పన్నాగంలో పోలీసులు పావులుగా మారారన్నారు. టిడిపి కూటమిగా వచ్చినా ఎదుర్కోలేక విధ్వంసం సృష్టించిందని, కొన్ని మూకలను ప్రేరేపించి దాడులకు పాల్పడిందని ఆరోపించారు.

నిఘా నేత్రం

- కౌంటింగ్ అనంతరం ఘర్షణలు జరగకుండా చర్యలు
- క్రిమినల్స్, నేరస్తులపై పిడి యాక్ట్
- స్ట్రాంగ్ రూమ్స్ ప్రాంతాలకు 2 కిలోమీటర్ల మేర రెడ్‌జోన్ అమలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హింస, అల్లర్లు జరిగిన నేపథ్యంలో అటువంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్దయెత్తున వినియోగించుకునేలా అడుగులు ముందుకేస్తోంది. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుండగా, ఫలితాల అనంతరం పలు ప్రాంతాల్లో అల్లర్లు, హింస ప్రజ్వరిల్లే అవకాశాలున్నాయని కేంద్ర ఇంటెలిజెన్సీశాఖ అలెర్ట్ మెసేజ్ ఇచ్చిన నేపథ్యంలో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. డివిజన్లు, సర్కిల్స్, పోలీస్ స్టేషన్ల వారీ అల్లర్లు, దౌర్జన్యాలు జరిగే గ్రామాలు ఏమున్నాయి? ఆయా గ్రామాల్లో ఏమే వర్గాల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉండొచ్చు? అనే అంశాలపై పోలీస్‌శాఖ ఆరా తీస్తోంది.

ఎన్నికల నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనల్లో పాల్గొన్న వారిపై పిడి యాక్ట్ పెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పదే పదే కేసుల్లో ఇరుక్కుంటున్న వారిని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటికే గ్రామాల వారీ చాలా మందిని స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడం, బైండోవర్ చేసుకునే ప్రక్రియను ఆ శాఖ ప్రారంభించింది. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అల్లర్లు జరుగుతాయని ప్రాథమికంగా పోలీస్‌శాఖ గుర్తించిన జంక్షన్స్‌లో సిసి కెమెరాలను ఏర్పాటుచేసే ప్రక్రియను వేగవంతం చేసే పనిలో ఆ శాఖ నిమగ్నమైనట్లు సమాచారం.

మీడియా సమావేశాల ద్వారా సందేశాలు!

క్షణికావేశంలో ఉద్రిక్తతలకు పోయి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు కోల్పోవాల్సి వస్తుందనే విషయాన్ని యువతకు తెలిపేందుకు ఈ వారంలో జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు సంయుక్తంగా మీడియా సమావేశాల ద్వారా సందేశాలను ఇవ్వనున్నట్లు సమాచారం. అలాగే గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమైనప్పటికీ గెలిచిన అభ్యర్థి వర్గం.. ఓడిన అభ్యర్థి తాలూకా అనుచరులపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్స్‌కు 2 కిలోమీటర్ల వరకు రెడ్‌జోన్ (నో ఫ్లయింగ్ జోన్)గా పోలీస్‌శాఖ ప్రకటించింది. ఆయా ప్రాంతాల్లో డ్రోన్స్, బెలూన్స్ ఎగురవేయడాన్ని నిషేధించినట్లు విజయవాడ పోలీస్ కమిషనరు పిహెచ్‌డి రామకృష్ణ సోమవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానాన్ని ఆ శాఖ అనుసరిస్తున్నట్లు సమాచారం. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాలతోపాటు విజయవాడ సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల్లో అల్లర్లు జరిగే అవకాశమున్నట్లు ఇంటెలిజెన్స్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో పోలీస్‌శాఖ ఇప్పట్నుంచే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

పంట, మురుగు కాల్వలను అభివృద్ధి చేయండి

- ఏపి కౌలు రైతుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మరికొన్ని రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో మురుగు, పంట కాల్వల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని ఏపి కౌలు రైతు సంఘం ప్రధాన, సహాయ కార్యదర్శులు ఎం హరిబాబు, పి రంగారావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విజయవాడలోని ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఈ అంశంపై వారు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృష్ణా, పశ్చిమగోదావరి, కోనసీమ, గుంటూరు, బాపట్ల, కాకినాడ తదితర జిల్లాల్లోని పంట, మురుగు కాల్వలు పూర్తిగా తూటుకాడ, గుర్రపు డెక్కతో నిండిపోయాయని, గతేడాది జులైలో కురిసిన వర్షాలకు ఈ జిల్లాల్లోని రైతులందరూ పూర్తిగా నష్టపోయారని చెప్పారు. ఓవైపు వర్షపు నీరు వెళ్లేందుకు కాల్వలు సరిగ్గా లేక, మరోవైపు పంట పొలాలకు సకాలంలో సాగునీరు అందక రైతులు నష్టపోయారని, ఈ ఏడాది త్వరితగతిన పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇడి, సిబిఐ కేసుల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు జూన్ 3 వరకు పొడిగించింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ సోమవారంతో ముగిసింది. దీంతో తీహార్ జైలు అధికారులు కవితను వర్చువల్ మోడ్‌లో కోర్టు ముందు ప్రవేశపెట్టారు. తొలుత సిబిఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీపై విచారణ చేపట్టగా, ఆమె కస్టడీని పొడిగించాలని సిబిఐ తరపున న్యాయవాది పంకజ్ గుప్తా కోర్టును కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం, సిబిఐ కేసులో కవిత కస్టడీని పొడిగించింది. తరువాత ఇడి కేసులోనూ కవిత జ్యుడీషియల్ కస్టడీపై విచారణ జరిగింది. దర్యాప్తు కీలక దశలో ఉందని, కవిత కస్టడీ పొడిగించాలని ఇడి న్యాయవాది జోహెబ్ హుస్సేన్ కోర్టును కోరారు. అలాగే కవితతోపాటు మరో నలుగురిపై దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వాదనలపై కవిత తరపున న్యాయవాది నితేశ్ రాణా అభ్యంతరం తెలిపారు. ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన తరువాత కస్టడీ అవసరం లేదని, కవితను విడుదల చేయాలని కోరారు. ఇరువైపులా వాదనలు విన్న స్పెషల్ జడ్జి, ఇడి కేసులోనూ కవిత జ్యుడీషియల్ కస్టడీని జూన్ 3 వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే సిబిఐ అక్రమంగా అరెస్టు చేసిందని, ఇడి, సిబిఐ కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని కవిత దాఖలు చేసిన పిటిషన్‌లపై ఈ నెల 24న ఢిల్లీ హైకోర్టు విచారణ జరపనుంది.

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దవడుగూరు (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవడుగూరు మండల కేంద్రంలోని చేనేత కాలనీకి చెందిన కుళ్లాయప్ప (40) కుటుంబం ఇంటి వద్దనే చేనేత మగ్గం నేస్తూ జీవనం సాగిస్తోంది. మగ్గం పని గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం కుళ్లాయప్ప అప్పులు చేశారు. ఆ కుటుంబానికి ఎలాంటి ఆదాయమూ లేకపోవడంతో అప్పు ఇచ్చిన వారు బాకీ తీర్చాలని ఒత్తిడి చేశారు. అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైన కుళ్లాయప్ప ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకున్నారు. కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుళ్లాయప్ప మృతి చెందారు. ఆయనకు సుమారు రూ.4 లక్షల మేరకు అప్పులు ఉన్నాయని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. కుళ్లాయప్పకు భార్య విజయలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. విజయక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాటర్‌కు క్లారివేట్ అవార్డ్

హైదరాబాద్ : ఎలెక్ట్రిక్ మొబిలిటి సంస్థ మాటర్ ఆటోమోటివ్ విభాగములో క్లారివేట్ దక్షిణాసియా ఇన్నొవేషన్ అవార్డ్స్ 2024ను దక్కించుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. క్లీన్ ఎనర్జీ, మొబిలిటీ పరిష్కారాల విభాగలో ఆవిష్కరణలు, సాంకేతిక కల్పనల పట్ల తమ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమని మాటర్ గ్రూప్ సిటిఒ కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు.

వేతన ఒప్పందం కోసం
ఫుడ్ ఫ్యాట్స్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి)

యాజమాన్యం మొండి వైఖరి వీడి వెంటనే వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ (3ఎఫ్) కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండల పరిధిలోని పత్తిపాడులోని 3ఎఫ్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద దీక్షలు ప్రారంభించారు.

తొలుత సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్ దీక్షా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 2023 మార్చితో గత వేతన ఒప్పందం పూర్తయినప్పటికీ యాజమాన్యం నూతన వేతన ఒప్పందం అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు.

గత వేతన ఒప్పందం 29.5 శాతం కంటే ఎక్కువ వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరిపై కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రెండేళ్లకొకసారి వేతన



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ఒప్పందం చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరి వీడకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు చేపట్టి యాజమాన్యానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.గణేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్, సీతమ్మధార (విశాఖపట్నం)

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థ శ్రీచైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విశాఖ రామాటాకీస్ సమీపంలోని శ్రీ చైతన్య కాలేజీ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో కళాశాల యాజమాన్యం విద్యార్థి సంఘం నాయకులపై దురుసుగా ప్రవర్తించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.అజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా యూనిఫారాలు, షూలు, పుస్తకాలు విక్రయిస్తూ పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తున్నాయన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక భారం పడుతోందన్నారు. ఇంటర్‌మీడియట్ బోర్డు, ప్రభుత్వ అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో శ్రీ చైతన్య, నారాయణ, ఫిట్జీ, తిరుమల, శ్రీ విశ్వా, భాష్యం, రవీంద్రభారతి, పెన్ స్కూల్, విజ్ఞాన్, గాయత్రి, ఆకాష్, పొలక్స్, లిటిలేంజస్, అసెంట్ కాలేజీలతోపాటు పలు విద్యా సంస్థలు పుస్తకాల వ్యాపారాలు నిర్వహిస్తూ జేబులు నింపుకుంటున్నాయని



శ్రీచైతన్య కళాశాల వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తెలిపారు. ఆర్ఐఒ తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోని పక్షంలో అన్ని కాలేజీలు, స్కూళ్ల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.సాయితేజ, జిల్లా నాయకులు అఖిల్, హర్షిత్, సూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాల గది సీజ్



ఎస్ఎఫ్ఐ ఆందోళన విషయం తెలిసి ఆర్ఐఒ కార్యాలయ సిబ్బంది శ్రీచైతన్య కళాశాల వద్దకు చేరుకుని పుస్తకాల గదిని సీజ్ చేశారు. దీంతో విద్యార్థి సంఘం నాయకులు శాంతించారు.

ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి

- సిఇఒకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల సందర్భంగా విధులు నిర్వర్తించిన మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లకు ప్రత్యేక అలవెన్స్ చెల్లించాలని సిఇఒ ఎంకె మీనాను ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు కోరారు. ఎన్నికల సామగ్రిని బస్సుల్లోంచి కిందకు దించటం, ఎన్నికల కేంద్రాలకు తరలించటం, ఎన్నికలు పూర్తయిన తర్వాత వాటిని బస్సుల్లో ఎక్కించటం, తదితర సేవలను ఈ సిబ్బంది చేశారన్నారు. అర్ధరాత్రి వరకు పనిచేయాల్సి వచ్చిందని, కానీ ఈ సేవలకు గానూ ఇతర అధికారులకు చెల్లించిన విధంగా ప్రత్యేక అలవెన్సులు వీరికి చెల్లించలేదని సిఇఒకు సోమవారం పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. వెంటనే స్పందించి మున్సిపల్, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లకు ప్రత్యేక అలవెన్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒను కోరారు.

భారత్ అత్యంత పేద దేశం



- నిరుద్యోగం ఎక్కువ
- ఉద్యోగాలు కల్పిస్తేనే అభివృద్ధి
- ఓటర్లు పరిపక్వత కలిగిన వారు
- ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్

న్యూఢిల్లీ : భారత్ ఇప్పటికీ అత్యంత పేద దేశమేనని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. జి20 దేశాల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అయినప్పటికీ పేద దేశమేనని పేర్కొన్నారు. సిఎన్ఎన్ ఇంటర్వ్యూలో 'అన్ జిపిఎస్ : ఇండియాస్ ఎంప్లాయిమెంట్ క్రైసిస్' అనే అంశంపై రాజన్ మాట్లాడుతూ.. భారత్‌లోని నిరుద్యోగ సమస్యపై విమర్శలు గుప్పించారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) రిపోర్ట్ ప్రకారం.. 2024 ఏప్రిల్ నాటికి భారత్‌లో 8.1 శాతం నిరుద్యోగం ఉందన్నారు. భారతదేశంలోని శ్రామిక జనాభాలో కేవలం 37.6 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారని వివరించారు. పెద్ద సంఖ్యలో యువత శ్రామికశక్తిలోకి వస్తేనే మేలు జరుగుతుందన్నారు. యువకులకు కావలసిన ఉపాధి కల్పించగలిగితేనే.. దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

"ఇక్కడ అధిక జనాభా ఉండటం వల్ల మొత్తం జిడిపి పరంగా ఇతర దేశాలను అధిగమిస్తుంది. ఈ క్రమంలో ఇప్పటికే బ్రిటన్‌ను ఇండియా అధిగమించింది. త్వరలోనే భారత ఆర్థిక వ్యవస్థ జపాన్, జర్మనీలను అధిగమించి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే.. భారతదేశం వృద్ధాప్యం కాకముందే భారతీయులు ధనవంతులు కాగలరా..? అన్నదే ప్రశ్న." అని రాజన్ అన్నారు.

ప్రస్తుతం భారత జనాభాకు వయసు పెరుగుతుందని రాజన్ పేర్కొన్నారు. 2047-2050 నాటికి భారతీయ జనాభా వృద్ధాప్యంలోకి ప్రవేశించనుందన్నారు. అప్పటికి మనం ధనవంతులం కాబోతున్నామా అన్నదే అసలు ప్రశ్న అని రాజన్ అన్నారు. భారతదేశానికి తగినంత ఉద్యోగాలను సృష్టించడం, వారికి ఉపాధి కల్పించేలా నైపుణ్యాన్ని పెంచడం, కార్మిక శక్తిలో మహిళా భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం తక్షణ సవాల్‌గా రాజన్ పేర్కొన్నారు.

కాగా.. భారత్ ప్రస్తుతం కొనసాగుతున్న 6-6.5 శాతం వృద్ధితో దానిని సాధించటం కుదరదని రాజన్ అన్నారు. మోడీ ప్రభుత్వానికి ఎంత క్రెడిట్ దక్కుతుందనే ప్రశ్నపై రాజన్ సమాధానం ఇస్తూ.. రోడ్లు, రైల్వేలు నిర్మాణాలు, మౌలిక వసతులు బాగున్నప్పటికీ.. ముఖ్యంగా చర్చలు, చర్చల కోసం స్వేచ్ఛా వాతావరణం అవసరమని సూచించారు. అలాగే దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

2024 ఆర్థిక సర్వేలో నిరుద్యోగ పదాన్ని ప్రభుత్వం ప్రస్తావించలేదని రాజన్ అన్నారు. జాతీయవాదం, మైనారిటీలపై స్పందించిన రాజన్ ఏ దేశమూ తన జనాభాలో అధిక భాగాన్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించడం ద్వారా విజయం సాధించలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశం అనుభవిస్తున్న సమానత్వ వాతావరణాన్ని ఎవరూ రద్దు చేయలేరని విమర్శించారు. బిజెపి ప్రభుత్వాలు తీసుకుంటున్న కొన్ని చర్యలు ముస్లింలతో పాటు ఇతర మైనారిటీలకు చాలా బలమైన ప్రతికూల సంకేతాలను పంపుతున్నాయని అన్నారు. టాప్ 100లో భారతదేశానికి చెందిన ఒక్క విశ్వవిద్యాలయం కూడా లేదని రాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం ఎప్పుడూ ఆశ్చర్యపరిచే మార్గాన్ని కలిగి ఉందని, "భారత ఓటర్ల పరిపక్వతను చూసి మనం మళ్లీ మళ్లీ ఆశ్చర్యపోతాము" అని రాజన్ అన్నారు.

జనన, మరణ నమోదుకు కొత్త పోర్టల్

- డిజిటల్‌గానూ ధ్రువపత్రం పొందే వెసులుబాటు
- వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి గతేడాది అక్టోబరు ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన సరికొత్త విధానంపై ప్రజల్లో పెద్దయెత్తున అవగాహన కల్పించాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు ఆదేశించారు. పునరుద్ధరించిన సిఆర్ఎస్ పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు వైద్యశాఖాధికారులకు, జనన, మరణ రిజిస్ట్రార్ అధికారులకు విజయవాడలో సోమవారం రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్‌టి కృష్ణబాబు ప్రసంగిస్తూ.. గతంలో ఉన్న సిఆర్ఎస్ పోర్టల్‌లో అదనంగా పలు మార్పులను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా చేసిందన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రాంతీయ భాషల్లో ఆన్‌లైన్‌లో రిపోర్టు చేసుకునే వెసులుబాటు, ఆన్‌లైన్‌లో రుసుము చెల్లింపు, ఇ-మెయిల్స్‌కు ధ్రువపత్రాలను పంపించే వెసులుబాటు, తదితర అంశాలు పోర్టల్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 43 వేల మంది ఆశా వర్కర్లు, 13 వేల ఎఎన్ఎంలు, పదివేల మంది సిహెచ్‌ఒలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయి, ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. విద్యా సంస్థల్లో చేరేందుకు, డ్రైవింగ్ లైసెన్స్‌కు, ఓటర్‌గా నమోదయ్యేందుకు, వివాహాల నమోదుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ నియామకాలకు, పాస్‌పోర్టు, ఆధార్ కార్డు జారీకి ఈ సరికొత్త జనన ధ్రువపత్రం ఉపయోగపడుతుందని వివరించారు. ఈ ధ్రువీకరణ పత్రాల జారీలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను మరింత పటిష్టపర్చాలన్నారు. డిజిటల్ సర్టిఫికెట్‌ను ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్, డైరెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పటేల్ కంటైనర్‌లో సెల్విన్ పెట్టుబడులు..

అహ్మదాబాద్ : పటేల్ కంటైనర్ ఇండియాలో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనకు సెల్విన్ ట్రేడర్స్ లిమిటెడ్ డైరెక్టర్ బోర్డు ఆమోదం తెలిపింది. పటేల్ కంటైనర్‌లో 36 శాతం వాటాను కంపెనీ కొనుగోలు చేయనుంది. గుజరాత్‌లోని భావ్ నగర్ జిల్లాలో లాజిస్టిక్ కంటైనర్ల కోసం కొత్త తయారీ కేంద్రం ఏర్పాటుకు మద్దతు ఇవ్వడానికి సెల్విన్ ట్రేడర్స్ పెట్టుబడిని ఉపయోగించనున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. ఈ తయారీ కేంద్రం కోసం రూ.45 కోట్ల వ్యయం చేయనుంది. దీనికి సంబంధించి మే15న ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు సెల్విన్ ట్రేడర్స్ ఎండి వేదాంత్ పంచాల్ తెలిపారు.



భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న సిఎస్ జవహర్‌రెడ్డి

నిర్ణీత సమయానికి భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం

- పనులను పరిశీలించిన సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-భోగాపురం (విజయనగరం జిల్లా)

భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని జిఎంఆర్ ప్రతినిధులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనం, రన్‌వే, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ భవనాలు, ఇతర నిర్మాణ పనులను సందర్శించారు. ఎయిర్‌పోర్టు ప్లాన్‌ను పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలను సిఎస్‌కు జిఎంఆర్ ప్రతినిధులు వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల పట్ల జవహర్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, జిఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సిఇఒ మనోమయ్ రాయ్, ప్రాజెక్టు హెడ్ బిహెచ్.ఎ.రామరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.16 వేల కోట్లు ఏమయ్యాయి?

- డిబిటి లబ్ధిదారులకు పూర్తిగా జరగని చెల్లింపులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అవసరాల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సెక్యూరిటీ బాండ్ల అమ్మకాల రూపంలో సేకరించిన 16 వేల కోట్ల రూపాయలు ఎలా ఖర్చుచేశారన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రతి మంగళవారం రిజర్వ్‌బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించే ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భారీగా రుణాలు సేకరిస్తుంది. ఇందులో భాగంగా ఇటీవల 54 రోజుల్లోనే 16 వేల కోట్లు రుణాన్ని సమీకరించింది. ముందుగా ఈ రుణాలను ఏప్రిల్, మే నెలల్లో నవరత్నాల్లో భాగంగా అనేక పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు నగదు బదిలీ రూపంలో చెల్లించాలని నిర్ణయించారు. అయితే, అది జరగలేదు.

పోలింగ్‌కు ఒకటి, రెండు రోజుల ముందు చెల్లించాలన్న వ్యూహం కూడా ఎన్నికల కమిషన్ జోక్యంతో విఫలమైంది. పోలింగ్ పూర్తయిన తరువాత కూడా ఇప్పటివరకు ఎవరికీ చెల్లింపులు జరగలేదు. లబ్దిదారులకు మొత్తం 14 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉందగా, కేవలం 1500 నుంచి 2000 కోట్ల వరకు మాత్రమే చెల్లించినట్లు అధికారులే చెబుతున్నారు. ఈ నిధులు కూడా సాధారణ ఆదాయం నుంచే చెల్లించినట్లు తెలిసింది. ఇక కాంట్రాక్టర్లకు కూడా భారీగానే చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే వీటికి కూడా ఇతర నిధులనే ఎక్కువగా వినియోగించినట్లు సమాచారం.

ప్రతి నెలా రాష్ట్ర ఖజానాకు 14 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం, కేంద్రం ఇచ్చిన నిధులు, పలు రుణాలు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు కలిపి ఈ మొత్తం సమకూరుతుంది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు వంటివి చెల్లించగా, మిగిలిన నిధులతోనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించినట్లు చెబుతున్నారు. రిజర్వ్ బ్యాంకు నుంచి సమీకరించిన 16 వేల కోట్లు ఎక్కడ, ఎలా ఖర్చు చేశారన్న విషయం తెలడం లేదు. అధికారులు కూడా దీనిపై పెదవి విప్పడం లేదు.

రోజుకు 315 కోట్లు

రిజర్వ్‌బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను పరిశీలిస్తే రోజుకు 315 కోట్లు చొప్పున సేకరించినట్టయింది. అంటే ఇంత భారీగా సేకరించిన నిధులతో ఎన్నో పనులు చేయవచ్చని అధికారులు అంటున్నారు. అయినప్పటికీ ఈ మొత్తంలో అభివృద్ధికి కానీ, సంక్షేమం కోసం లబ్ధిదారులకు ఇచ్చింది కానీ నామమాత్రమే అని సీనియర్ అధికారులు సైతం అభిప్రాయ పడుతున్నారు.

రిజర్వ్‌బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల వివరాలు (రూ. కోట్లలో)

నెల	రుణ మొత్తం
ఏప్రిల్	4,000
ఏప్రిల్ 8	3,000
ఏప్రిల్ 16	2,000
ఏప్రిల్ 30	4,000
మే 7	3,000
మొత్తం	16,000

ఎగిసిన చమురు, బంగారం

- ఇరాన్ అధ్యక్షుడి మృతి ఎఫెక్ట్

న్యూఢిల్లీ : ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ అజర్ బైజాన్ హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో చమురు, బంగారం ధరలు పెరిగాయి. రైసీ మరణ వార్తతో వెంటనే సోమవారం చమురు ఎక్కువ ఉత్పత్తి చేసే మధ్యప్రాచ్య ప్రాంతంలో రాజకీయ అనిశ్చితి నెలకొనడంతో చమురు ధరలు పెరిగిపోయాయి. అంతర్జాతీయంగా బంగారం ధరలు కూడా ఎగిశాయి. ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. స్పాట్ బంగారం ఔన్సు ధర 1 శాతం పెరిగి 2,438.44 డాలర్లకు చేరుకుంది. యుఎస్ గోల్డ్ ఫ్యూచర్స్ 1.1 శాతం పెరిగి 2,442.60 డాలర్లుగా నమోదయ్యింది. గ్లోబల్ అనిశ్చితులు ఏర్పాడితే ఇన్వెస్టర్లు పసిడిపై పెట్టుబడులను సురక్షితంగా భావించడంతో ఆ లోహానికి డిమాండ్ పెరుగుతుంది. చమురు బ్యారెల్‌కు 41 సెంట్లు లేదా 0.5 శాతం పెరిగి 84.39 డాలర్లకు చేరుకుంది.

సంపాదకీయం


ఖరీఫ్ సన్నద్ధత?

ఈఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే జూన్ తొలి వారంలోనే రాష్ట్రాన్ని పలకరిస్తాయన్న వాతావరణ శాఖ చల్లని కబురు అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలతో తల్లడిల్లుతున్న జనానికి భారీ ఉపశమనం. నిరుడు ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు వైఫల్యం చెందగా ఈ మారు పసిఫిక్‌లో లానినా పరిస్థితుల వలన అధిక వర్షం కురుస్తుందన్న సూచన రైతాంగానికి పెద్ద ఊరట. వ్యవసాయ ఆధారిత ఎ.పి.కి ఖరీఫ్ ప్రధానమైనది. ఇప్పుడే 60-70 శాతం భూమి సాగవుతుంది. కోటి ఎకరాలకు పైగా సేద్యం కోటి మందికి పైగా రైతులకు, కౌలు రైతులకు, అంతే సంఖ్యలో ఉన్న వ్యవసాయ కార్మికులకు జీవనాధారం ఇదే. రాష్ట్ర స్థూలోత్పత్తికి సైతం ఇదే ఇరుసు. కాగా గత సంవత్సరం రుతుపవనాలు ఆలస్యమయ్యాయి. వచ్చాక కూడా అంతగా ప్రభావం చూపని కారణంగా ఖరీఫ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితి నెలకొంది. సీజన్ ముగిసే సమయానికి 400 మండలాల్లో తీవ్ర వర్షాభావం తిష్ట వేసింది. ప్రభుత్వం మాత్రం 103 మండలాల్లోనే కరువును ప్రకటించింది. రబీలోనూ అనావృష్టి కొనసాగగా, ఎన్నికల షెడ్యూల్ వస్తుందనగా 87 కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకొంది. రైతులు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయలేదు. వేసిన పంటల్లో లక్షల ఎకరాలు దెబ్బతిన్నాయి. కరువుతో పాటు అకాల వర్షాలు, డిసెంబర్‌లో వచ్చిన మిచౌంగ్ తుపాన్ రైతుల ఉసురు తీసింది. ఇప్పుడు 'నైరుతి' మోసుకొచ్చిన తీపి కబురు విపత్తులతో నష్టాలు చవిచూసిన రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి.

ఖరీఫ్ సజావుగా సాగాలంటే రైతులకు అదనుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పరపతి అందుబాటులో ఉంచాలి. మొన్నటి వరకు ఎన్నికల బిజీలో ప్రభుత్వ యంత్రాంగం తలమునకలైంది. పోలింగ్ ముగిసినప్పటికీ జూన్ 4న ఫలితాలొచ్చే వరకు కోడ్ అమల్లో ఉంది. అప్పటి వరకు ఇ.సి. పర్యవేక్షణలో ప్రభుత్వం నడుస్తుంది. కోడ్ ఉంది కదా అని సీజన్ ఆగదు. అందుకనుగుణంగా అధికార యంత్రాంగం ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి. కానీ ఇప్పటి వరకు సమగ్ర సమీక్ష లేదు. సబ్సిడీ విత్తనాల సేకరణ మొదలు కాలేదు. ఎరువులపైనా ఉదాసీనతే. పరపతి పరిస్థితీ అదే తీరు. ఖరీఫ్‌లో కరువు, తుపాన్‌లతో పంట నష్టపోయిన 12 లక్షల రైతులకు రూ.1,294 కోట్లు విడుదల చేస్తూ ఎన్నికల కోడ్ రాకముందు మార్చి 6న ముఖ్యమంత్రి బటన్ నొక్కగా ఇప్పటికీ ఖాతాల్లో జమ కాలేదు. బీమా వ్యవహారం తేల్లేదు. విపత్తు మండలాల్లో బ్యాంకులు ఫ్రెష్ లోన్లు ఇవ్వలేదు. వార్షిక రుణ ప్రణాళిక మీటింగ్‌లు ఎన్నికల పేరిట వాయిదా పడ్డాయి. రైతు భరోసా కిస్తు ప్రశ్నార్థకమైంది. కేంద్రం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలొచ్చే వరకు తేలేటట్లు లేదు. రబీ పంటల సేకరణను పట్టించుకునేనాథుడు లేడు. రబీ పంట నష్టాలపై అతీగతీ లేదు. రైతులకు విత్తనాలివ్వకుండా, రుణాలిప్పించకుండా, ఎరువుల్లేకుండా, రుణాలు, పెట్టుబడి సాయం ఇవ్వకుండా సేద్యం ఎలా చేస్తారు? ఎన్నికలయ్యాక చూసుకుందామనుకుంటే గడచిన కాలం తిరిగొస్తుందా?

ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. అది నడుస్తూనే ఉండాలి. ఎన్నికైన ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు ప్రాధమ్యాలు మారుతుంటాయి. ఎన్నికలున్నందునే ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ కొన్ని మాసాల ఖర్చుకు సభామోదం తీసుకుంటుంది. ఈ ఖరీఫ్‌లో స్కీములు, ఇతర వ్యవహారాలు ఓటాన్ బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా అమలవుతాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇతర అంశాలు నిర్ణయమవుతాయి. ఎన్నికలు సరిగ్గా ఖరీఫ్ వేళ వచ్చినందున ఈ అంశాలను ప్రభుత్వం, సి.ఎస్. గమనంలోకి తీసుకొని సమీక్షలు జరిపి ఖరీఫ్‌కు యావత్ యంత్రాంగాన్నీ సిద్ధం చేయాలి. సామాజిక పెన్షన్ల మాదిరిగా ఇన్‌పుట్ సబ్సిడీకి, రైతు భరోసా, బీమా, సబ్సిడీ విత్తనాలకు ఇబ్బందులేమీ ఉండవు. అవసరమైతే ఇ.సి. నుంచి తగిన అనుమతులు తీసుకొని ఖరీఫ్ సాగడానికి అన్ని ఏర్పాట్లూ చేయాలి. పోలింగ్ వరకు అధికార వైసిపి, టిడిపి కూటమి పార్టీలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకున్నారు. పోలింగ్ ముగిశాకా అదే ధోరణితో ఉన్నారు. గెలుపోటముల అంచనాల్లో బిజీగా గడుపుతున్నారు. వాటన్నింటినీ పక్కనపెట్టి ఖరీఫ్ సన్నద్ధతపై ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించే పని చేయాలి.

మహనీయుల మాట




ఏ దేశంలోనైనా శాస్త్రీయ ఆలోచన యొక్క...కళల యొక్క చరిత్రను అర్థం చేసుకోవాలంటే...ఆ దేశ ఆర్థిక రంగం ఒక్కదాన్ని గురించి తెలుసుకుంటే సరిపోదు. అక్కడి ఆర్థిక రంగం నుంచి సామాజిక మానసిక స్థితి లోకి వెళ్లడమెలాగో నేర్చుకోవాలి.

- జి.వి. ప్లెఖనోవ్,
రష్యన్ విప్లవకారుడు,
మార్క్సిస్టు సిద్ధాంతవేత్త.

ఇది నయవంచనకు మానవతకు మధ్య పోరాటం



ఇప్పుడు అమెరికన్ యూనివర్శిటీల క్యాంపస్‌లలో నిరసనలు చెలరేగుతున్నాయి. ఇజ్రాయిల్ సైనిక యంత్రాంగంతో లావాదేవీలు నడుపుతున్న వ్యాపార సంస్థలతో తెగతెంపులు చేసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. 1968-1974 మధ్య కాలంలో వియత్నాం యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీల క్యాంపస్‌లను చుట్టుముట్టిన నిరసనలు ఈ సందర్భంగా గుర్తుకొస్తున్నాయి. ఐతే, అప్పటికీ, ఇప్పటికీ ఒక ప్రధానమైన తేడా ఉంది. అప్పటి యుద్ధంలో అమెరికా నేరుగా దిగబడింది. ఇప్పుడలా కాదు. అమెరికా యుద్ధంలో ఉన్నప్పుడు యువతను సైనిక సేవల కోసం వినియోగించే అవకాశం ఉండేది. దాని నుంచి తప్పించుకోవాలనే స్వార్థంతో అప్పటి విద్యార్థులు నిరసనలకు దిగారు. అని భాష్యం చెప్పడానికి అవకాశం ఉండేది. కాని ఇప్పుడు తలెత్తుతున్న నిరసనల వెనుక విద్యార్థుల స్వప్రయోజనాలు ఎంత మాత్రమూ లేవని స్పష్టంగా చెప్పగలం. అదే సమయంలో వియత్నాంతో యుద్ధంలో ఉన్నప్పుడు ప్రతిరోజూ సంభవిస్తున్న అమెరికన్ సైనికుల మరణాల వార్తలకు స్పందించిన అమెరికన్ ప్రభుత్వ యంత్రాంగంలోని ఒక భాగం యుద్ధానికి ముగింపు పలకమని తీవ్రంగా ఒత్తిడి చేయసాగింది. ఇప్పుడు అటువంటి తీవ్రత ఏదీ లేదు. అమెరికా ప్రత్యక్షంగా యుద్ధంలో లేనందువలన విద్యార్థులు తెలియజేస్తున్న నిరసనలు అత్యంత సూత్రబద్ధమైనవిగాను, తీవ్రమైనవిగాను పరిగణించాలి. ప్రభుత్వ యంత్రాంగం శాంతిస్థాపన కోరుతూ చేస్తున్న ప్రకటనల వెనుక అటువంటి సూత్రబద్ధత గాని, తీవ్రత గాని లేదని కూడా స్పష్టం అవుతోంది.



ప్రభాత్ పట్నాయక్

ఇప్పుడు విద్యార్థులు అచ్చంగా మానవత్వ దృష్టితో స్పందిస్తున్నారు. జాతి హననం పట్ల తీవ్ర వ్యతిరేకత, వలసలు పోయిన వారు ఆ ప్రాంతాన్ని తమ వలసగా మార్చి ఆక్రమించుకునే విధానం పట్ల వ్యతిరేకత, జాతి విద్వేషంతో వ్యవహరిస్తున్న యూదు దురహంకార ప్రభుత్వానికి సామ్రాజ్యవాద దేశాలు మద్దతు పలకడం పట్ల వ్యతిరేకత ఆ విద్యార్థులను నిరసనలకు పురికొల్పాయి. శాంతి, సౌభ్రాతృత్వాల కోసం తపించే మానవుల ఆకాంక్షలకు ఈ నిరసనలు ప్రతిబింబం.

ఇంకోపక్క అమెరికన్ ప్రభుత్వం మాత్రం రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోంది. ఒకపక్క శాంతి కావాలంటూ పైకి ప్రకటిస్తూనే ఆ యుద్ధం కొనసాగడానికి చెయ్యవలసినదంతా చేస్తోంది. అమాయక పౌరుల మీద సాగుతున్న క్రూర దమనకాండను ఖండిస్తూనే, ఆ క్రూరత్వాన్ని కొనసాగించడానికి అవసరమైన ఆయుధాలను సరఫరా చేస్తోంది. విద్యార్థుల నిరసనలు మానవత్వానికి ప్రతీకలుగా ఉంటే... అందుకు పూర్తి వ్యతిరేకంగా పతన దిశగా అడుగులు వేస్తున్న సామ్రాజ్యవాదం ఉంది.

ఈ మోసకారితనం అన్ని స్థాయిలలోనూ వ్యక్తం అవుతోంది. అనేక సంవత్సరాల నుంచి సామ్రాజ్యవాద దేశాలు పాలస్తీనా సమస్యకు పరిష్కారం పాలస్తీనా, ఇజ్రాయిల్ వేర్వేరు రాజ్యాలుగా పక్కపక్కన ఉండటమేనన్న వైఖరికి

> **ఇంకోపక్క అమెరికన్ ప్రభుత్వం మాత్రం రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోంది. ఒకపక్క శాంతి కావాలంటూ పైకి ప్రకటిస్తూనే ఆ యుద్ధం కొనసాగడానికి చెయ్యవలసినదంతా చేస్తోంది. అమాయక పౌరుల మీద సాగుతున్న క్రూర దమనకాండను ఖండిస్తూనే, ఆ క్రూరత్వాన్ని కొనసాగించడానికి అవసరమైన ఆయుధాలను సరఫరా చేస్తోంది. విద్యార్థుల నిరసనలు మానవత్వానికి ప్రతీకలుగా ఉంటే...అందుకు పూర్తి వ్యతిరేకంగా పతన దిశగా అడుగులు వేస్తున్న సామ్రాజ్యవాదం ఉంది.**

కట్టుబడి వున్నాయి. అలా వేర్వేరు రాజ్యాలుగా విడిపోవడం మెరుగైన పరిష్కారమా లేక ఒకే రాజ్యంగా కొనసాగుతూనే సార్వత్రిక ఓటు హక్కు ద్వారా ఎన్నికైన ప్రభుత్వం కింద పాలస్తీనియన్లు, యూదులు సఖ్యంగా జీవించడం మెరుగా? అన్న చర్చ పక్కన పెడదాం. రెండు దేశాల పరిష్కారాన్ని అంతర్జాతీయ సమాజం ఎప్పటి నుంచో బలపరుస్తూ వస్తోంది. చివరికి సామ్రాజ్యవాద దేశాలు కూడా దీనిని అంగీకరించక తప్పలేదు. ఈ పరిష్కారాన్ని అమలు చేయాలంటే వెంటనే ఒక పాలస్తీనా రాజ్యం స్వతంత్రంగా ఉనికిలోకి రావాలి. పాలస్తీనాను ఐ.రా.స లో పూర్తి స్థాయి సభ్యురాలిగా తీసుకోవాలి. కాని పాలస్తీనాను పూర్తి స్థాయి సభ్య దేశంగా తీసుకోవాలనే ప్రతిపాదన ఐ.రా.స భద్రతామండలిలో చర్చకు వచ్చిన ప్రతిసారీ అమెరికా తన వీటో అధికారాన్ని ఉపయోగించి అడ్డుకుంటూనే ఉంది.

ఏప్రిల్ 19వ తేదీన జరిగిందిదే. ఇజ్రాయిల్ లోని యూదు దురహంకార ప్రభుత్వం స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు వ్యతిరేకం. అలా స్వతంత్ర పాలస్తీనా ఏర్పడితే, అప్పటితో ఇజ్రాయిల్ అనుసరించే విస్తరణవాదానికి (బైట నుంచి వలసదారులుగా వచ్చి, ఆశ్రయం కల్పించిన ప్రాంతాన్నే స్వాధీనం చేసుకునే కుట్ర) తెర పడుతుంది. బైటకు చూస్తే అమెరికా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు అనుకూలమేనన్నట్టు ప్రకటిస్తూ ఉంటుంది. కాని కీలక సందర్భం వచ్చిన ప్రతీసారీ యూదు దురహంకారాన్ని బలపరుస్తుంది. ఈ మే 10వ తేదీన ఐరాస సర్వ సభ్య సమావేశం భారీ మెజారిటీతో పాలస్తీనాకు పూర్తి స్థాయి సభ్యత్వం ఇవ్వాలని తీర్మానించింది. 143 ఓట్లు తీర్మానానికి అనుకూలంగాను, 9 వ్యతిరేకంగాను పడ్డాయి. మరో 25 దేశాలు గైర్హాజరయ్యాయి. ఈ తీర్మానంలోనే భద్రతా మండలిని ఈ అంశాన్ని పున:సమీక్షించవలసిందిగా సర్వసభ్య సమావేశం కోరింది. అమెరికాతో బాటు అర్జెంటీనా, హంగేరీ వంటి మరికొన్ని పచ్చి మితవాద దేశాలు మాత్రం ఈ తీర్మానాన్ని వ్యతిరేకించాయి. తక్కిన సామ్రాజ్యవాద దేశాలు ఫ్రాన్స్‌తో సహా, తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశాయి. ఈ అంశం భద్రతా మండలి ముందుకు మళ్లీ చర్చకు వస్తే అమెరికా మరోసారి తన వీటో హక్కుని ఉపయోగించి పాలస్తీనాకు పూర్తి స్థాయి సభ్యత్వం రాకుండా మోకాలడ్డుతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ప్రపంచ జనాభాలో అత్యధిక శాతం కోరుతున్న పరిష్కారంగాని, శాంతి స్థాపనగాని అమెరికాకు అక్కరలేదు.

తన దేశంలో తలెత్తుతున్న విద్యార్థుల నిరసనల పట్ల సైతం అమెరికన్ ప్రభుత్వం ఇదే విధమైన మోసపూరిత వైఖరిని అవలంబిస్తోంది. పలు క్యాంపస్‌లలో పోలీసులు ప్రవేశించి అక్కడ విద్యార్థుల నిరసన శిబిరాలను కూల్చివేశారు. వందలాది మంది విద్యార్థులను అరెస్టులు చేశారు. ఆ నిరసనలు చాలా శాంతియుతంగా నడుస్తున్నప్పటికీ పోలీసులు ఈ దమనకాండకు తెగబడ్డారు. శాంతియుతంగా కొనసాగే నిరసనల మీద ఈవిధంగా విరుచుకుపడడం భావప్రకటనా స్వేచ్ఛను హరించడమే. కాని ఈ దమనకాండను అమెరికన్ అధికార యంత్రాంగం యావత్తూ సమర్థించింది. డొనాల్డ్ ట్రంప్ నుంచి జో బైడెన్ దాకా, హిలరీ క్లింటన్ సైతం ఈ అణచివేతను సమర్థించారు. 'తీవ్రవాద మూకలు కాలేజీ క్యాంపస్‌లను స్వాధీనం చేసుకుంటున్నాయని అయినా బైడెన్ మాత్రం మెతకగా వ్యవహరిస్తున్నాడని' విమర్శిస్తూ ట్రంప్ ప్రకటనలు కూడా చేశాడు. ఇక బైడెన్ వంతుకొస్తే కొలంబియా యూనివర్సిటీ తదితర క్యాంపస్‌లలో పోలీసుల దుర్మార్గాన్ని సమర్థించాడు. అక్కడ 'ఉదారవాదుల' మనోభావాలకు అనుగుణంగానే ఆ విద్యార్థులు యూదు వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారని ఆరోపించాడు. ఆ నిరసనకారుల్లో అనేకులు యూదు విద్యార్థులే. ఈ వాస్తవాన్ని మరుగుపరిచి వికృత వ్యాఖ్యానాలు చేశాడు. మధ్యప్రాచ్యం చరిత్ర తెలియనందువల్లే విద్యార్థులు ఈ మాదిరి ఆందోళనలకు పూనుకుంటున్నారంటూ హిలరీ క్లింటన్ వ్యాఖ్యానించారు. ఆ చరిత్ర జ్ఞానం పొందితే దానివల్ల అక్కడ జరుగుతున్న జాతి హననాన్ని సమర్థించ గలుగుతారా?

> **ఇప్పుడు విద్యార్థులు అచ్చంగా మానవత్వ దృష్టితో స్పందిస్తున్నారు. జాతి హననం పట్ల తీవ్ర వ్యతిరేకత, వలసలు పోయిన వారు ఆ ప్రాంతాన్ని తమ వలసగా మార్చి ఆక్రమించుకునే విధానం పట్ల వ్యతిరేకత, జాతి విద్వేషంతో వ్యవహరిస్తున్న యూదు దురహంకార ప్రభుత్వానికి సామ్రాజ్యవాద దేశాలు మద్దతు పలకడం పట్ల వ్యతిరేకత ఆ విద్యార్థులను నిరసనలకు పురికొల్పాయి. శాంతి, సౌభ్రాతృత్వాల కోసం తపించే మానవుల ఆకాంక్షలకు ఈ నిరసనలు ప్రతిబింబం.**

వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమం ఒకానొక సమయానికి యూజిన్ మెకార్థీ, రాబర్ట్ కెనడీ వంటి ముఖ్య అమెరికన్ నేతల మద్దతు పొందింది. ఆ యుద్ధంలో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొనడమే ఇందుకు కారణం. కాని ప్రస్తుత సందర్భంలో మొత్తం రాజకీయ నాయకులు, అధికార బృందాలు అందరూ ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడిని సమర్థిస్తున్నారు. విద్యార్థుల ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నారు.

తక్కిన సామ్రాజ్యవాద దేశాలలో కూడా ఇటువంటి విద్యార్థి నిరసనలే తలెత్తాయి. అక్కడ కూడా చాలా క్యాంపస్‌లలో వారి మీద దమనకాండకు పూనుకున్నారు. బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్ యూనివర్శిటీల వైస్ ఛాన్స్‌లర్లకు పోలీసులను దింపమని, విద్యార్థుల నిరసనలను అణచివేయమని సలహా ఇచ్చాడు. ఐతే, కొందరు వైస్ ఛాన్స్‌లర్లు ఇందుకు బాహాటంగానే వ్యతిరేకించారు. అతడు పిలిచిన సమావేశానికి కొందరు హారజరయ్యారు కూడా. కాని అమెరికాలో అటువంటి వ్యతిరేకత ఎక్కడా తలెత్తలేదు. విద్యార్థుల నిరసనల పట్ల తమ స్వంత పద్ధతుల్లో వ్యవహరించడానికి పూనుకున్న కొందరు అధికారుల చేత బలవంతంగా రాజీనామాలు చేయించారు.

ఈ మాదిరిగా యూనివర్సిటీ క్యాంపస్‌లలో భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నాలు చూస్తుంటే అమెరికాలో ఒక కొత్త తరహా మెకార్థీయిజం విజృంభిస్తోందా? అని భావించాల్సి వస్తోంది. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా అధికారంలో ఉన్న మితవాద నాయకులు క్యాంపస్‌లలో స్వతంత్ర భావాలు తలెత్తకుండా అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. 1950 దశకంలో మెకార్థీయిజం తలెత్తినపుడు దాని వెనుక ప్రేరణగా ప్రచ్ఛన్న యుద్ధం, కమ్యూనిజం అంటే భయం పనిచేశాయి. ఇప్పుడీ కొత్త తరహా మెకార్థీయిజం వెనుక పని చేస్తున్నవి ఏమిటి?

నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో తలెత్తిన సంక్షోభం నేపథ్యంలో పెట్టుబడిదారీ దేశాల్లో నయా ఫాసిస్టు శక్తులు, మితవాద శక్తులు బలం పుంజుకున్నాయి. కొత్తతరహా మెకార్థీయిజం ఈ శక్తులతో ప్రత్యక్షంగా పెనవేసుకుని ఉంది. ఇంతకాలం రాజకీయ అధికార కేంద్రాలకు ఎడంగా పక్కకు నెట్టబడివున్న ఫాసిస్టు శక్తులను అధికార కేంద్రంలోకి నయాఫాసిజం తీసుకొచ్చింది. అంతేగాక ఈ శక్తులు 'ఉదారవాద' రాజకీయ శక్తుల మీద కూడా పెత్తనం చేయగలిగేట్టు చేసింది. ఆ విధంగా ఒక ఏకీకృతమైన మితవాద కూటమిగా తయారై వామపక్ష శక్తులు మళ్లీ పుంజుకోకుండా వారి ప్రయత్నాలను దెబ్బ తీయడానికి తయారయ్యాయి.

బ్రిటన్‌లో జెరిమీ కార్బిన్ లేబర్ పార్టీ నాయకుడిగా ఎన్నికైనప్పుడు అతడు అధికార వ్యవస్థను సవాలు చేశాడు. అప్పుడతనికి వ్యతిరేకంగా కుట్ర పన్నారు. అతడు యూదు వ్యతిరేకి అని ప్రచారం చేశారు. పాలస్తీనా ప్రజలకు అతడు మద్దతు తెలపడమే దీనికి కారణం. ఆ తర్వాత అతడిని ఏకంగా లేబర్ పార్టీ నుంచి బహిష్కరించారు.

సామ్రాజ్యవాద దేశాలలోని యూనివర్సిటీలలో విద్యార్థులు, అధ్యాపకులు ఇప్పటికీ స్వతంత్ర భావాలకు కేంద్రంగా ఉన్నారు. వారి నైతిక బలంతో మితవాద కూటమికి ఒక సవాలుగా మారారు. అందుచేత మితవాద శక్తుల కూటమి మరింత బలపడాలంటే సవాలును ఎదుర్కోవడం ఒక ముఖ్యమైన అంశంగా ముందుకొచ్చింది. అన్ని రకాల స్వతంత్ర భావాలనూ నాశనం చేయాలి. మానవత్వపు ఛాయలన్నింటినీ మంటగలపాలి. అప్పుడే ఈ మితవాద కూటమి ఆధిపత్యం తిరుగులేనిదిగా కొనసాగుతుంది. ఈ రోజు అమెరికాలో మనం చూస్తున్నది ఇదే. భావ ప్రకటనా స్వేచ్ఛను బరితెగించి నాశనం చేస్తున్నారు.

జాతి హననం జరుగుతున్నప్పుడు దానిని వ్యతిరేకిస్తే దానికి 'యూదు వ్యతిరేకత' అని ముద్ర వేస్తున్నారు. ఇప్పుడు నిరసనలు తెలుపుతున్న విద్యార్థులు కాని, జెరిమీ కార్బిన్ కాని వాస్తవానికి యూదు వ్యతిరేకులు కారు. నిజానికి వారిని విమర్శిస్తున్న వారికే నాజీలతో కుమ్మక్కై వ్యవహరించిన చరిత్ర ఉంది. (యూదుల పట్ల అమిత ద్వేషాన్ని ప్రదర్శించి వారిని ఊచకోత కోసింది నాజీలే) కాని తమ వ్యతిరేకుల మీద అభాండాలు మోపి వారి ఉద్యమాల మీద బురద జల్లడానికి ఈ 'యూదు వ్యతిరేకులు' అన్న ఆరోపణ పనికొస్తోంది.

ఈనాడు అమెరికన్ యూనివర్సిటీల క్యాంపస్‌లలో జరుగుతున్న ఘటనలకు చాలా ప్రాధాన్యత ఉంది. అక్కడ ఇప్పుడు మోసకారితనానికి, మానవత్వానికి జరుగుతున్న పోరాటం రాబోయే కాలంలో నిర్ణయించే వర్గ పోరాటానికి నాంది కాగలదు.

/ స్వేచ్ఛానుసరణ /

వ్యాఖ్య

ఉల్టా అయిన మోడీ



ముస్లింలు ఎక్కువ మంది పిల్లలను కంటారని, వారు అక్రమ చొరబాటుదారులని, వారికి మంగళసూత్రాలు కూడా లాక్కుని పంచి పెడతారని మాట్లాడిన మోడీ నాలుక మడత పెట్టి నేను ముస్లింలని, హిందువులని మాట్లాడలేదంటూ మరోసారి బొంకారు. పైగా గోధ్రా ఘటనల తర్వాత తన మీద దుష్ప్రచారం చేశారని వాపోతున్నారు. హఠాత్తుగా ఈ తెలివిడి ఎందుకు వచ్చింది? ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన రోజు నుండి తన పదవిని, అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ముస్లింలు ఈ దేశానికి శత్రువులని ప్రచారం చేసింది ఎవరు? గోధ్రా దాడుల్లో పార్లమెంటు మాజీ సభ్యుడు, కాంగ్రెసు నాయకుడు ఇషాన్ జాఫ్రీ...మోడీకి, పోలీసు అధికారులకు, తెలిసిన నాయకులకు తమ పరిస్థితి గురించి మొత్తుకున్నా, సహాయం కోసం చివరి నిముషం వరకు ఎదురు చూసినా, ఆయనతో సహా 124 మందిని సజీవంగా తగలబెట్టారు. ముఖ్యమంత్రిగా మోడీ కనీసం సంతాపం కూడా ప్రకటించలేదే! జునైద్ 17 సంవత్సరాల బిడ్డ! నడుస్తున్న రైలు నుండి తోసేసి చంపారు. మోడీ ఏమైనా స్పందించారా? ఆయనకు చీమ కుట్టినట్లు కూడా లేదే? అఖ్లాక్ ఇంటి మీద పడి ఫ్రిజ్‌లో గో మాంసం ఉందనే సాకుతో ఆయనను చంపిన నేరస్తులకు ఉద్యోగాలిచ్చినప్పుడు హంతకులకు ఉద్యోగాలు ఎవరిచ్చారనే ప్రశ్న రాలేదే! ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో!



డి. రమాదేవి

స్పందించారా? కోవిడ్ వ్యాప్తికి తబ్లిగీ జమాతే ప్రార్థనలు కారణం అంటూ విష ప్రచారాన్ని సాగించింది మోడీ ఆశీర్వాదంతో కాదా? మిస్సయింది ముగ్గురు మహిళలైతే 32,000 మహిళలు మిస్సయ్యారంటూ తీసిన 'కేరళ స్టోరీ' సినిమాని లవ్ జిహాదీ పేరిట ప్రమోట్ చేసింది మోడీ, అమిత్ షా లే కదా! ముస్లింల మీద ఎన్ని రూపాలలో ఎన్ని రకాలుగా అపోహ, విద్వేషాలను సృష్టించే యత్నం చేశారు! నాసిక్ జిల్లాలో మాలెగావ్ లోని మసీదు దగ్గర చేసిన బాంబు దాడుల్లో నేరస్తులైన సాధ్వి ప్రజ్ఞా, కల్నల్ పురోహిత్ లాంటి హిందుత్వ ఉగ్రవాదులకు అండగా నిలిచింది కూడా వీరే కదా!

ఇప్పుడు ఈ నంగనాచి కబుర్లేమిటి? ముస్లిం కుటుంబాల గురించి కాదు, ప్రతి పేద కుటుంబం గురించి అంటున్నారు. ఎక్కువ సంతానానికి కారణం పేదరికం అన్న జ్ఞానం మన ప్రధానికి ఉంటే వారికి తాళిబొట్లు పెరుక్కుని పంచుతారని 'పంచులు' ఎందుకు వేసినట్లు? పేదరికం నుంచి ఉద్ధరించడానికే కదా 'లక్ దీదీ'ల గురించి మాట్లాడారు. మరి కాంగ్రెస్‌ని తాళిబొట్లు పంచుతారంటూ ఎందుకు ఎద్దేవ చేసినట్లు...!

ఎక్కువ మంది పిల్లలు ఉన్నవాళ్లు అంటే ముస్లింలని అర్థం తీయడం చాలా అన్యాయమంటూ అమాయకత్వం, ఆశ్చర్యం తెగ వ్యక్తం చేస్తున్నారు. మీ పిల్లలకు ప్రభుత్వం బాధ్యత వహించాలనుకోవద్దని సుద్దులు చెప్పబూనుకున్నారు. జనాభాకు పేదరికానికి అంతర్గత సంబంధం ఉన్నదని, అందుకు పేదరికాన్ని తొలిగించాలని కదా నిపుణులు చెప్తున్నారు. అందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలా? లేదా? అక్షరాశ్యత పెరిగిన చోట ఆ కుటుంబాలు కూడా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తున్నాయి కదా. మరి నిరక్షరాస్యతను తొలగిం చాల్సిన బాధ్యత ఎవరిది? పిల్లలను ఎక్కువ కంటున్నారని ఎవరిని దూషిస్తున్నట్లు! 'చొరబాటు దారులు' అన్నది ఎవరిని? దాడుల్లో సర్వ నాశనం అయిన ప్రజలకు కనీస సౌకర్యాల కోసం అడిగితే ఏమన్నారు ఈ మోడీ! పరాయివారిగా సృష్టించి పారదోలే పన్నాగాలు, బానిసల్లా పడి ఉండాలన్న నిరంకుశ పెత్తందారీ లక్షణాలు కావా?

మోడీ వాచాలతను, తెంపరితనాన్ని, విద్వేష ప్రచారాన్ని నలు వైపులా ప్రశ్నించడంతో ఇప్పుడు మోడీ ఉల్టా అవడం కాదా! లేదు, లేదు నా ఉద్దేశం అది కాదంటూ ఇచ్చే వివరణ నష్ట నివారణ కోసమా?

ముస్లిం కుటుంబాలతో ఆయన అనుబంధం గురించి ఊరించి చెప్తున్నారు. ఈద్ పండుగ కూడా జరుపుకుంటామని రంగులద్దుతున్నారు. ఇంటి పక్కన ఉన్న ముస్లిం స్నేహితులు పంపే భోజనాలతో ఇంట్లో వంటే లేదని చెప్పుకుంటున్నారు. హలాల్ చేసిన మాంసాన్ని అమ్మడం మీద, కొనడం మీద దుష్ప్రచారం చేస్తున్నదెవరో? మొహరం రోజు త్యాగాల గాథలను కూడా విన్నారట! అంత స్నేహంతోనేనా ముస్లింల ప్రాణాలను, ఆడబిడ్డల మానాలను హరించి దోషులను రక్షించింది? గోధ్రా దాడుల్లో హత్యగావించబడిన వారి గురించి ఏమన్నారు? కారు కింద కుక్క పిల్ల పడ్తే పట్టించుకుంటామా అని కదా మాట్లాడారు. సబర్మతి రైలులో అగ్నికి ఆహుతైన కరసేవకుల శవాలను ఊరేగించవద్దని మత విద్వేషాలు పెరుగుతాయని అధికారులు వారించినప్పుడు...ఈద్ సందర్భంగా ముస్లిం మిత్రులు పంపిన ఆహారం తిన్న విషయం గుర్తుకు రాలేదా? గుజరాత్‌లో జరిగిన ఊచకోతను రాణా ఆయూబ్ ప్రపంచానికి వెల్లడి చేసిన కారణంగా ఆమెకు ఆంక్షలు పెడ్తున్నారే! దీన్నేమంటారు?

> **ఎక్కువ మంది పిల్లలు ఉన్నవాళ్లు అంటే ముస్లింలని అర్థం తీయడం చాలా అన్యాయమంటూ అమాయకత్వం, ఆశ్చర్యం తెగ వ్యక్తం చేస్తున్నారు. మీ పిల్లలకు ప్రభుత్వం బాధ్యత వహించాలనుకోవద్దని సుద్దులు చెప్పబూనుకున్నారు. జనాభాకు పేదరికానికి అంతర్గత సంబంధం ఉన్నదని, అందుకు పేదరికాన్ని తొలిగించాలని కదా నిపుణులు చెప్తున్నారు. అందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలా? లేదా? అక్షరాశ్యత పెరిగిన చోట ఆ కుటుంబాలు కూడా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తున్నాయి కదా. మరి నిరక్షరాస్యతను తొలగించాల్సిన బాధ్యత ఎవరిది? పిల్లలను ఎక్కువ కంటున్నారని ఎవరిని దూషిస్తున్నట్లు!**

ముస్లింలు ఓటేస్తారా అంటే వేస్తారని చెప్పకోలేనంత విభజన. ఏమన్నారు? భారత పౌరులు ఓటేస్తారంటారు. అంటే ఎన్నికల ముందు సిఎఎ చట్టం అమలుకు పూనుకుని 80 శాతం ఓట్లు మావి అన్న భ్రమలు సృష్టించి లబ్ధి పొందాలన్న కుట్రలు కొనసాగాలన్నదేగా మీ అంతర్గత ఆకాంక్ష.

కానీ, మోడీ కంపెనీ కుట్రలను... మేము భారతీయులం అంటూ తిప్పి కొడ్తున్న జనం ధాటికి ఉల్టా అవుతున్నారు మోడీ. హిందూ, ముస్లిం అనే భేదం గురించి మాట్లాడితే ప్రజా జీవితంలో వుండనన్నారు. ఆయన వుండకపోవడం కాదు! అలాంటి వాళ్ళు ప్రజాజీవితంలో చెల్లుబాటు కారు!

/వ్యాసకర్త ఐద్వా రాష్ట్ర కార్యదర్శి/

కవిత్వం

గెలుపు ఎటువైపో

తిరగడాలు చెప్పడాలు
ఒప్పించడాలు
తప్పించడాలు
నానా రకాల హంగామాల
నడుమన
ఆ కార్యం కాస్త ఐపోయింది
గురి పెట్టిన స్థానం వైపు
చూపులన్నీ తిప్పుకున్నాయి
ఏ దారి ఏ గమ్యం వైపో
ఏ తీర్పు ఎటువైపో
బేరీజుల గమనంలో జనం
లెక్కల కొక్కీలకు
వేలాడుతూ
ఎదురు చూపుల
ఉత్కంఠలు.
గెలుపు ఎటువైపునోననే
ఆత్రుతల కాలంతో
మమేకమై
చర్చించుకునే కబుర్లతో
ఎన్నో ఒడిదుడుకుల
వలయాలను
తెంపుకుని సాగుతున్న
పరుగులో
గీతను తాకే గెలుపు కోసం
వేచి చూసే తరుణం
మొదలైంది
లాక్కోవడాలు
తోసుకోవడాలు
ఆగ్రహావేశాల పరంపరలు
సమస్తానికి శుభం కార్డు
వేసాక
తదుపరి గెలుపుకై
జన సమూహం వేచి
చూస్తోంది.
ఓటు కాలం వెళ్ళిపోయాక
ఫలితాల కాలం
మొదలైంది
సర్వేలన్నీ మెడకు
చుట్టుకుని
భవిష్యత్తును
తూకం వేసే మాటలకు
తలలు ఊపుతూ
నించోవాలి.
ఏది నిజమో ఏది
అబద్ధమో తెలియని
అయోమయంతో జత కట్టి
అనుమానంగానే
అడుగులెయ్యాలి
ఏ తీర్పు ఏ చేతిని
తాకుతుందో
ఏ ఓటమి ఏ కాలును
లాగుతుందో
ఊహించని మననంతో
నిద్రకు ఉపక్రమించాలి
నాలుగు దిక్కులా జన
నాడి
ఫలితాల కోసం ఆత్రుతగా
కొట్టుకుంటోంది ఔను
మరి.

- నరెద్దుల రాజారెడ్డి

ఐదో దశ పోలింగ్ చిత్రాలు



మహారాష్ట్రలోని ఒక పోలింగ్ బూత్ వద్ద తుపాకీతో పహారా కాస్తున్న జవాన్



కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో క్యూలో నిల్చున్న ఓటర్లు



ముంబయిలో వీల్ చెయిర్‌లో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధురాలు



ఓటు హక్కు వినియోగించుకున్న అమిర్‌ఖాన్ దంపతులు

ఛత్తీస్‌గఢ్‌లో దారుణం

- వాహనం లోయలో పడి 18 మంది దుర్మరణం

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని ఒక పికప్ వాహనం అదుపుతప్పి లోయలో పడిన దుర్ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 17 మంది మహిళలు ఉన్నారు. ఈ ఘటనలో మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం 1:45 గంటలకు కబీర్‌ధామ్ జిల్లాలో కుక్‌దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహపానీ గ్రామంలో ఈ ప్రమాదం జరిగింది. సమీప అడవిలో బీడీ ఆకులు కోసి పికప్ వాహనంలో తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు సహాయక కార్యక్రమాలు ప్రారంభించారు. సంఘటన స్థలంలోనే 12 మంది మహిళలు, ఒక పురుషుడు మరణించారని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఐదుగురు మహిళలు మృతి చెందారని కబీర్ ధామ్ పోలీస్ సూపరింటెండెంట్ అభిషేక్ పల్లవ తెలిపారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి విష్ణు దేవ సాయి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి వెల్లడించారు.

ఇన్ని ఫిర్యాదులు చేసినా చర్యలేవీ ?

- ఎన్నికల కమిషన్‌కు సీతారాం ఏచూరి ప్రశ్న
- ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మరో లేఖ



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర బిజెపి నేతలు పదేపదే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ ఉల్లంఘనలకు సంబంధించి గతంలో అనేక ఫిర్యాదులు చేసినా ఎన్నికల కమిషన్ మౌనం పాటించడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి నేతలు పలువురు ఎన్నికల కోడ్‌ను పదే పదే ఉల్లంఘిస్తున్న అంశాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు., బిజెపి నేతలు చెబుతున్న అసత్యాలు, కట్టు కథలు, విద్వేషాలు రెచ్చగొట్టడం వంటి వాటి గురించి లేవనెత్తామని ఏచూరి ఆ లేఖలో గుర్తు చేశారు. దురదృష్టవశాత్తూ, వీటిల్లో ఏ ఒక్కదానిపైనా ఎన్నికల కమిషన్ స్పందించలేదని, దోషులను శిక్షించలేదని ఏచూరి పేర్కొన్నారు.

ఈ రుగ్మతను మొగ్గలోనే తుంచేసేలా తక్షణమే దోషులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా ఇసి మౌనం వహించిందని ఏచూరి విమర్శించారు. దీనిని అలుసుగా తీసుకుని బిజెపి నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు. తాజాగా ఈ నెల 16న యుపిలోని బారాబంకిలో ఎన్నికల ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ, "సమాజ్‌వాదీ, కాంగ్రెస్‌లు అధికారంలోకి వస్తే, తిరిగి రామాలయాన్ని బుల్డోజరుతో ధ్వంసం చేస్తారని" నిర్లజ్జగా మాట్లాడారు.

సర్నాలో ఈ నెల 17న ఎన్నికల ర్యాలీలో యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల్లో భాగమే ఇది. కేవలం ముస్లింలకు లబ్ధి చేకూరేలా మతం ప్రాతిపదికన వారు రిజర్వేషన్లు కల్పించాలని భావిస్తున్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల కోటాలను దోచేసి, వాటిని ముస్లింలకు అందజేయాలని కాంగ్రెస్, ఆర్‌జెడిలులు ప్రయత్నిస్తున్నాయి." అని ఆరోపించారు.

సివాన్‌లోని రఘునాథ్‌పూర్‌లో ఎన్నికల సభలో ఈ నెల 18న అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ, ఎన్‌డిఎ తిరిగి అధికారంలోకి వస్తే యుసిసిని తీసుకువచ్చి, ఇలా నాలుగుసార్లు పెళ్లిళ్లు చేసుకోవడానికి స్వస్తి చెబుతుందన్నారు. మదరసాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, ముల్లాలను ఉత్పత్తి చేసే దుకాణాలను కూడా మూసేస్తామని చెప్పారు.

గతంలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏచూరి ఆ లేఖలో డిమాండ్ చేశారు. పైన పేర్కొన్న ఫిర్యాదులకు గానూ మోడీ, యోగి ఆదిత్యనాథ్, హేమంత బిశ్వశర్మలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పు చేసిన వారందరూ ఉన్నత పదవుల్లో వున్నారనే కారణాలతో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమైనట్లైతే, కమిషన్ నిష్పాక్షికత ప్రశ్నార్థకంగా మారుతుందని, విశ్వసనీయత దెబ్బ తింటుందని ఏచూరి స్పష్టం చేశారు.

సిపిఎం ఏజెంట్లపై టిఎంసి దాడులు

- ప్రతిఘటించిన సిపిఎం అభ్యర్థులు
- తృణమూల్‌పై తిరగబడ్డ ప్రజలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమబెంగాల్‌లో సిపిఎం ఏజెంట్లను కూర్చోనివ్వకుండా టిఎంసి గూండాలు దాడులకు దిగారు. అలాగే ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అధికార టిఎంసి ప్రయత్నించగా, టిఎంసి కుయుక్తులను ఎదురొడ్డి ప్రజాస్వామ్య పరిరక్షణకు సిపిఎం అభ్యర్థులు పనిచేశారు. పశ్చిమ బెంగాల్‌లో శ్రీరాంపూర్ నియోజకవర్గంలో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ బూత్ నెంబర్ 53 అధికార టిఎంసి బూత్‌ను కబ్జా చేసేందుకు ప్రయత్నించింది. సిపిఎం ఏజెంట్‌ను బూత్ నుంచి బయటకు నెట్టేశారు. ఓట్లను రిగ్గింగ్ చేసే ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు సిపిఎం అభ్యర్థి దీప్సితా ధర్ ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అభ్యర్థిపై కూడా తిరగబడేందుకు టిఎంసి గూండాలు ప్రయత్నించారు. టిఎంసికి వ్యతిరేకంగా క్యూ లైన్‌లో నిలబడిన సాధారణ ఓటర్లు నిరసన తెలిపారు. ప్రజల ప్రతిఘటనను చూసి దొంగలు బూత్‌ను వదిలి పారిపోయారు. ఓట్ల రిగ్గింగ్ చేసేవారిని సామాన్య ప్రజలే తరిమికొట్టారు. శ్రీరాంపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో బంక్రా బూత్‌లో సిపిఎం ఏజెంట్‌ను టిఎంసి గూండాలు కూర్చోనివ్వలేదు. దీంతో సిపిఎం అభ్యర్థి దీప్సితా ధర్ ఏజెంట్‌తో కలిసి బంక్రా బూత్ నెంబర్ 203కి వెళ్లారు. బాంగ్రాలోని బూత్ నెంబర్ 143లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

హౌరా లోక్‌సభ నియోజకవర్గంలోని రాజ్‌ఖోలా జమాదర్ పరిసర ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన గూండాలు సిపిఎం ఏజెంట్‌ను కొట్టి బయటకు తోసేశారు. నకిలీ ఓటర్లతో రిగ్గింగ్ మొదలైంది. విషయం తెలుసుకున్న సిపిఎం అభ్యర్థి సబ్యసాచి ఛటర్జీ అక్కడకు చేరుకుని బూత్‌లను పరిశీలించారు. అక్కడ టిఎంసి ఆగడాలను అడ్డుకున్నారు. జైరాంపూర్ మల్లిక్ పారాలో సిపిఎం ఏజెంట్లు కూర్చున్న క్యాంపు కార్యాలయాన్ని టిఎంసి గూండాలు ధ్వంసం చేశారు. సాధారణ ఓటర్లను కూడా అధికార టిఎంసి చంపేస్తామని బెదిరించింది. సిపిఎం అభ్యర్థి సబ్యసాచి ఛటర్జీ అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. పంచల కుశదంగా వద్ద బూత్ వెలుపల అక్రమంగా గుమిగూడి, ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకున్నారు. సిపిఎం అభ్యర్థి సబ్యసాచి ఛటర్జీ అక్కడకు చేరుకుని టిఎంసి గూండాలను అక్కడ నుంచి తరిమికొట్టారు. బరాక్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి దేవదత్ ఘోష్ బూత్‌లను పరిశీలించారు. టిఎంసి, బిజెపిల భీభత్సం కారణంగా సామాన్యులు ఓటు హక్కును కోల్పోయారు. బరాక్‌పూర్‌లో సామాన్య ప్రజల ఓటు హక్కు కోసం సిపిఎం పోరాటం చేసింది.

2న కేజ్రీవాల్‌ను కస్టడీకి అప్పగించండి : ఇడి

న్యూఢిల్లీ : మధ్యంతర బెయిల్ ముగిసిన తరువాత అంటే జూన్ 2న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తమకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని ప్రత్యేక కోర్టులో ఇడి సోమవారం పిటీషన్ వేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రస్తుతం కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై ఉన్న సంగతి తెలిసిందే. ఈ బెయిల్ గడువు జూన్ 1 వరకూ ఉంది. జూన్ 2న కేజ్రీవాల్ మళ్లీ కోర్టులో లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

ఇద్దరి మృతికి కారణమైన మైనర్

- స్వల్ప షరతులతో బెయిల్ మంజూరుపై విమర్శలు

పూణే : మహారాష్ట్రలోని పూణేలో ఒక మైనర్ మద్యం సేవించి కారు నడిపి ఇద్దరు మృతికి కారణమయ్యాడు. ఈ కేసులో మైనర్‌కు జువైనల్ కోర్టు స్వల్ప షరతులతో బెయిల్ మంజూరు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూణేలోని ఒక ప్రముఖ బిల్డర్ కుమారుడు ఇటీవలే 12వ తరగతి పూర్తి చేశాడు. శనివారం రాత్రి తన స్నేహితులతో కలిసి పోర్షే కారులో పబ్‌కు వెళ్లాడు. అక్కడ పార్టీలో పాల్గొని మద్యం సేవించాడు. పబ్ నుంచి తిరిగి వస్తూ బైక్‌ను ఢీ కొట్టాడు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ముందు హాజరుపర్చారు. ఈ కేసులో మైనర్‌కు కోర్టు స్వల్ప షరతులతో బెయిల్ మంజూరు చేసింది. (రోడ్డు ప్రమాదాలు, వాటి పరిష్కారాలపై 300 పదాలతో వ్యాసాన్ని రాసి 15 రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించింది. 15 రోజుల పాటు ట్రాఫిక్ పోలీసులతో కలిసి పనిచేయాలని కోర్టు మైనర్‌ను ఆదేశించింది. కౌన్సిలింగ్ కోసం ఆల్కహాల్ డి-అడిక్షన్ సెంటర్‌కు వెళ్లాలని సూచించింది. నిందితుడ్ని మేజర్‌గా పరిగణించి దర్యాప్తు చేసేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోరగా, కోర్టు అందుకు నిరాకరించింది.

ఎల్‌డిఎఫ్-2 ప్రభుత్వానికి మూడేళ్లు

- హామీలను నెరవేరుస్తున్నాం
- ముఖ్యమంత్రి పినరయి విజయన్



తిరువనంతపురం : కేరళలో వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సోమవారం మూడో వార్షికోత్సవాన్ని నిర్వహించింది. తమ ప్రభుత్వం నాలుగో ఏడాదిలోకి అడుగు పెట్టిన సందర్భంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తావించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని, నూతన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం ద్వారా అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతున్నామని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి ఒక పోస్టు పెట్టారు.. ప్రగతిశీల కేరళను సాధించడంలో తన ప్రభుత్వ నిబద్ధతను ఆయన .పునరుద్ఘాటించారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక వృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. 'సాంఘిక సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సమప్రాధాన్యతతో అమలు చేస్తున్న కేరళ జాతీయ స్థాయిలో ఎన్నో గుర్తింపులు పొందింది. ప్రభుత్వ విద్య, ఆరోగ్యం సహా ప్రాథమిక రంగాలు మరింత బలోపేతం అయ్యాయి. ఐటీలో పెట్టుబడులు రావడంతో పెద్ద పెద్ద కంపెనీలు వచ్చి స్టార్టప్ రంగానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. ఉపాధి హామీ పథకం, సామాజిక భద్రత పింఛన్లు, కారుణ్య బీమా సహా ప్రజా సంక్షేమ పథకాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచారు. కొచ్చి వాటర్ మెట్రో అభివద్ధి, పారిశ్రామిక రంగంలో జాతీయ రహదారుల అభివద్ధి శరవే గంగా సాగు తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల అభివద్ధిని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. మతతత్వం, మతోన్మాదం అనేక ప్రాంతాల్లో పైచేయి సాధించినప్పుడు.. కేరళలో ప్రజాస్వామ్యం, మత సామరస్యం, మానవత్వం యొక్క గొప్పతనాన్ని నిలబెట్టి ఇతరులకు ఆదర్శంగా నిలిచాము.

వీటన్నింటిని సాధ్యమయ్యేలా ప్రజలు ఇస్తున్న మద్దతు ప్రభుత్వానికి శక్తిని, చైతన్యాన్ని ఇస్తుంది. కొన్ని శక్తులు సంక్షోభం సృష్టించేందుకు ప్రయత్నించినా, ప్రభుత్వం, ప్రజలు పరస్పరం చేయిచేయి కలపడం వల్లనే విజయవంతంగా ముందుకు సాగుతున్నామని' సిఎం విజయన్ పేర్కొన్నారు. మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ హితం కోసం ప్రభుత్వానికి అండగా నిలుస్తున్న వారందరికీ అభినందనలు తెలిపారు.

ఉత్తర ప్రదేశ్‌లో బిజెపి దొంగ ఓట్లు

- ఎనిమిది ఓట్లేసిన వ్యక్తి అరెస్ట్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ లోక్‌సభ స్థానంలో బిజెపి కార్యకర్త కుమారుడు ఏకంగా ఎనిమిదిసార్లు ఇవిఎం బటన్ నొక్కాడు. అదేదో ఘనకార్యం అయినట్లు దానిని వీడియో తీసి అందరికీ పంపాడు. అది వైరల్ కావడంతో పోలీసులు అతనిని ఆదివారం అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. ఖిరియా పమారన్ గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త అనిల్ సింగ్ కుమారుడు రాజన్ సింగ్ పలుమార్లు ఓటు వేసినట్లు వీడియోలో కన్పించిందని, అతనిని పోలీసులు అరెస్ట్ చేశారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. ఐపిసిలోని 171 ఎఫ్, 419, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 128, 132, 136 సెక్షన్ల కింద రాజన్ సింగ్‌పై కేసు నమోదు చేశారు. దొంగ ఓట్ల వీడియోను సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ షేర్ చేశారు. ఫరూఖాబాద్‌లో ఈ నెల 13న పోలింగ్ జరిగింది. పోలింగ్ సిబ్బంది అందరినీ సస్పెండ్ చేయాలని, వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామని ఎన్నికల అధికారి నవదీప్ తెలిపారు. ఆ పోలింగ్ కేంద్రంలో రీపోలింగ్‌కు సిఫార్సు చేశామని కూడా చెప్పారు. తన కుమారుడు వికలాంగుల తరపున ఓటు వేశాడని, ఆ భాగాలను ఎడిట్ చేశారని అనిల్ సింగ్ ఆక్రోశం వెళ్లగక్కాడు. అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి ప్రజాస్వామ్యాన్ని లూటీ చేయాలని బిజెపి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తాం

- పిటిఐ ఇంటర్వ్యూలో మోడీ



భువనేశ్వర్ : అసత్యాలను అలవోకగా వల్లిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ తాజాగా పిటిఐకి ఇంటర్వ్యూ ఇస్తూ మైనార్టీలకు తాను ఎన్నడూ వ్యతిరేకం కాదని చెప్పారు. రెండవ విడత పోలింగ్ ముగిసినప్పటి నుంచి మైనార్టీలపై విషం గక్కుతూ వచ్చిన ఆయన చివరి రెండు దశల ప్రోలింగ్‌కు ముందు బాణీ మార్చారు. మాతో పాటు ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు పోవాలనుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ మాకు సమానమే,నని చెప్పుకొచ్చారు.. ఇప్పటివరకు జరిగిన నాలుగు విడతల పోలింగ్ సరళిపై ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ సమున్నతమైన స్థితిలో వుంటుందని, కాంగ్రెస్ సహ ఇండియా బ్లాక్‌లోని కొన్ని భాగస్వామ్య పార్టీలు కొన్ని రాష్ట్రాల్లో ఖాతా కూడా తెరవడానికి పోరాడాల్సిన పరిస్థితులు వున్నాయని సెలవిచ్చారు. ఈ రాజ్యాంగమే లేకపోతే, తనవంటి సామాజిక ఆర్థిక నేపథ్యం కలిగిన వ్యక్తి ఇంతటి స్థాయికి వచ్చేవాడా అంటూ అమాయకత్వాన్ని ఒలకబోశారు. నేను స్వప్రయోజనాలు కోసమే పనిచేశానని మీరందరూ అనుకున్నా నష్టం లేదు, ఎందుకంటే రాజ్యాంగ సంక్షేమంలోనే నా సొంత సంక్షేమం వుందని ఆయన చెప్పుకున్నారు. .

ప్రస్తుతం జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఆమోద ముద్ర అంటూ, అలాగే తాము తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని కూడా అంగీకరించినట్లయిందని మోడీ తన వాగాడంబరాన్ని ప్రదర్శించారు. కాశ్మీర్‌కు సంబంధించి తమ ప్రభుత్వానికి పెద్ద వ్యూహమే వుందన్నారు. రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ హామీకి కట్టుబడి ఉన్నామని అన్నారు. అయితే ఎప్పటికి పునరుద్ధరించేది ఇదమిత్థంగా చెప్పకుండా ఎప్పటిలానే దాటేశారు.

తమ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల పాలన గురించి మాట్లాడుతూ ఇదేమీ తమకు కొత్త కాదని, గతంలో కూడా ఇలాంటివి చేశామని చెప్పారు. ఒక దేశం, ఒకే ఎన్నిక గురించి మాట్లాడుతూ, ఇవన్నీ తమ ఎన్నికల ప్రణాళికలో భాగమేనన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే నిరుద్యోగానికి సంబంధించి తమ ప్రభుత్వం నమోదు చేసిన రికార్డు అత్యుత్తమమైనదని చెప్పుకున్నారు.

జార్ఖండ్‌లో సిపిఎం ప్రచారం



బురిజోడ్, జార్ఖండ్: జార్ఖండ్‌లో సిపిఎం అభ్యర్థుల తరపున పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రాజ్ మహల్ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోపిన్ సోరెన్‌కు మద్దతుగా సోమవారం అడ్రో, తులసిపూర్, లాల్ మాటియాలో నిర్వహించిన సభల్లో బృందాకరత్ తదితరులు ప్రసంగించారు. రాజ్‌మహల్ పరిధిలోని వేలాదిమంది గిరిజనులు సరైన నష్టపరిహారం పొందకుండానే నిర్వాసితులుగా మారారు. వారి హక్కుల కోసం సిపిఎం నేతలు అశోక్ షా, రఘువీర్ మండల్, ప్రేమ్ లాల్ సోరెన్ తదితరుల నేతృత్వంలో ఇప్పటికే పలు పోరాటాలు నిర్వహించారు.

యుద్ధనేరాల ప్రభువు నెతన్యాహు అరెస్టుకు వారెంట్ ఇవ్వండి

- ఐసిసిని కోరిన చీఫ్ ప్రాసిక్యూటర్
- 24గంటల్లో వందమందికి పైగా పాలస్తీనియన్లు మృతి

గాజా, జెరూసలేం : పెద్దయెత్తున యుద్ధ నేరాలకు పాల్పడిన ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు అరెస్టుకు వారెంట్ జారీ చేయాలని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును చీఫ్ ప్రాసిక్యూటర్ ఎ.ఎ.ఖాన్ కోరారు. అలాగే కొందరు హమాస్ నేతలపైనా వారెంట్ ఇవ్వాలని ఆయన వాదించారు. నెతన్యాహు, ఇజ్రాయిల్ రక్షణ మంత్రి గాలంట్‌లు తాము చేసిన నేరపూరితమైన కార్యకలాపాలకు బాధ్యత వహించాల్సిందేనని కాన్ అన్నారు. వారెంట్ జారీ చేయాల్సినవారి జాబితాలో హమాస్‌కి చెందిన ముగ్గురు నేతలు వున్నారు., చీఫ్ ప్రాసిక్యూటర్ వ్యాఖ్యలపై ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్ రుసరుసలాడారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ కుప్పకూలే ప్రమాదంలో వుందని ఆయన వ్యాఖ్యానించారు. తమ నేతలపై జారీ చేయాలనుకుంటున్న అరెస్టు వారంట్లను రద్దు చేయాల్సిందిగా హమాస్ కోరింది. బాధితులను, నేరాలకు పాల్పడినవారిని ఒకే గాటన కట్టడం సరికాదని పాలస్తీనా విమోచన సంస్థ (పిఎల్‌ఓ) అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. గాజాలో మారణహోమానికి పాల్పడిన వారిపై అరెస్టు వారంట్లు జారీ చేయాలని, అంతేకానీ ఈ మారణకాండలో బాధితులైన వారిపై కాదని ఆయన స్పష్టం చేశారు. హక్కులపై ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి కూడా ఐసిసి ప్రకటనను స్వాగతించారు. ఐసిజె మాదిరిగా ఐసిసి ఐక్యరాజ్య సమితి వ్యవస్థల్లో భాగం కాదు. దేశాల మధ్య చట్టపరమైన వివాదాలను పరిష్కరించే బాధ్యత ఐసిజెకి వుండగా, యుద్ధ నేరాలకు పాల్పడిన వ్యక్తులను ప్రాసిక్యూట్ చేసేందుకు ఐసిసికి అధికారం వుంటుంది. ఐసిజె సివిల్ ట్రిబ్యునల్ కాగా, ఐసిసి క్రిమినల్ ట్రిబ్యునల్.

వందిమందికి పైగా మృతి

గత 24గంటల్లో వంద మందికి పైగా పాలస్తీనియన్లు మృతి చెందారని, జాబాలియా శరణార్థ శిబిరానికి సమీపంలో గల అల్ అవదా ఆస్పత్రిలో తాగునీరు పూర్తిగా నిలిచిపోయిందని డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ తెలిపింది. రఫా, కరేమ్ అబూ సలేమ్ క్రాసింగ్‌లు మూసి వుండడంతో సహాయం నిలిచిపోయిందని, దీనివల్ల గాజాలో తీవ్రంగా ఆహార కొరత నెలకొందని ఐక్యరాజ్య సమితి మానవతా కార్యకలాపాల చీఫ్ హెచ్చరించారు. ఆ మార్గాలను తక్షణమే తెరవకపోతే సాయం అందడం ఆగిపోతుందని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ పేర్కొంది. ఇప్పటివరకు గాజాలో 35,562మంది మృతి చెందగా 79,652మంది గాయపడ్డారు.

అసాంజేకు ఊరట

అప్పగింతపై అప్పీల్‌కు అవకాశం

లండన్ : వికీలిక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజేకు ఇంగ్లండ్ హైకోర్టు సోమవారం ఊరట కల్పించింది. తనను అమెరికాకు అప్పగించాలన్న నిర్ణయంపై అప్పీల్ చేసుకునేందుకు అసాంజేకు హైకోర్టు అవకాశం ఇస్తూ తీర్పు ఇచ్చింది. సున్నితమైన మిలటరీ, దౌత్య వివరాలు ప్రచురించడం, గూఢచర్య చట్టాన్ని ఉల్లంఘించడం వంటి ఆరోపణలతో అమెరికా అసాంజేపై అభియోగాలు మోపింది. అసాంజేను తమకు అప్పగించాలని ఇంగ్లండ్‌ను కోరింది. దీంతో మరణ శిక్ష వర్తించదు, వాక్ స్వాతంత్ర్య హక్కులకు భంగం కలిగించమని అమెరికా ఇచ్చిన రెండు హామీలతో అసాంజేను అప్పగించడానికి ఇంగ్లండ్ ముందుకు వచ్చింది. అమెరికా హామీలు 'అమలు కాని హామీలు' అంటూ కోర్టులో అసాంజే తరుపు న్యాయవాదులు ఆశ్రయించారు. సోమవారం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కోర్టు వెలుపల గుమిగూడిన జనం హర్షధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా అసాంజే భార్య స్టెల్లా మాట్లాడుతూ అమెరికా వాదనలను ఖండించారు. ఈ కేసును జర్నలిస్టులపై దాడిగా అభివర్ణించారు. 2019 నుంచి అసాంజే అత్యంత భారీ భద్రతతో కూడిన బెల్మార్ష్ జైలులో ఉంటున్నారు.




వేసవి విడిది

గులాబీ మొక్క



అనగనగా ఒక అడవిలో గులాబీ మొక్క వికసించింది. అది అక్కడ ఉన్న అన్ని మొక్కల కన్నా అందంగా ఉండేది. అడవిలో ఉన్న అన్ని మొక్కలూ గులాబీని జాగ్రత్తగా చూసుకునేవి. అందరూ తనని గొప్పగా చూస్తుంటే గులాబీ మొక్కకు భలే సంతోషంగా ఉండేది. ఒక రోజు ఒక పర్యాటకుడు అడవిని సందర్శించడానికి వచ్చాడు. అలా ప్రయాణిస్తూ, ప్రయాణిస్తూ, అడవి మధ్యలోకి చేరుకున్నాడు. అక్కడే గడ్డి మొక్కల మధ్య ఉన్న గులాబీని చూసాడు. వెంటనే దాని దగ్గరికి వెళ్లి, 'నువ్వు ఇంత అందంగా ఉన్నావు. నువ్వసలు ఈ అడవిలో ఉండవలసినదానివి కాదు. పట్టణ సౌందర్యం మధ్య నీలాంటి వాళ్లు ఉంటే ఎంతో గౌరవం, మర్యాద ఉంటాయి' అని చెప్పాడు. బాటసారి మాటలకు గులాబీ ఉప్పొంగిపోయింది. ఇంతలో మళ్లీ బాటసారి గులాబీతో ఇలా అన్నాడు. 'నేను రేపు మళ్లీ వస్తాను. పట్టణానికి తీసకెళతాను. అక్కడ చూద్దువు గాని, నీ గొప్పతనం'. అని చెప్పాడు.

అతను వెళ్ళగానే మిగతా మొక్కలు గులాబీతో ఇలా అన్నాయి. 'నువ్వు అతనితో కలిసి పట్టణానికి వెళ్లొద్దు. ఆ పట్టణపు గాలిలో నువ్వు బతకలేవు. అతను నీకు మాయమాటలు చెప్పి నిన్ను ఏమార్చాలి అని అనుకుంటున్నాడు' అని ఎన్నో విధాలుగా నచ్చచెప్పాయి'. అయినా గులాబీ మాట వినలేదు. పట్టణానికి వెళ్లడానికే సిద్ధపడింది. మరుసటి రోజు బాటసారి గులాబీ మొక్క దగ్గరకు వచ్చాడు. వేర్లతో సహా పీకి, పట్టణానికి తీసుకొని వెళ్ళాడు. పట్టణం చేరేసరికి గులాబీ మొక్క పూర్తిగా వాడిపోయింది. దీంతో, ఆ మొక్కను బయట విసిరేసాడు. "అయ్యో ... నా మిత్రుల మాట వినకపోతినే!" అని లోలోపల కుమిలి పోయింది గులాబీ మొక్క!



సీతా సాయి సుహృత,
8వ తరగతి, మాడుగుల, అనకాపల్లి జిల్లా.

వేసవి విడిదిలో ...



వేసవి విడిది వచ్చింది
ఆహ్లాదాన్ని పంచింది
ఆటలు బాగా ఆడించింది
జాలీగా కాలం గడిపింది

చుట్టాలింటికి వెళ్ళాము
అందరితో కలిసున్నాము
మాటా మంతి కలిపాము
గతాన్ని నెమరు వేసాము

బొమ్మలు బాగా గీసాము
చిట్టి కథలను రాసాము
గేయాలెన్నో చదివాము
హాయిగా పొద్దు గడిపాము

పరిసరాలు చుట్టొచ్చాము
ప్రకృతిలో కలిసి పోయాము
పొలాలు గట్లు తిరిగాము
చెట్లతో చెలిమి చేసాము

అవ్వ తాతను కలిసాము
పొడుపు కథలు విప్పాము
సాధు జంతువుల్ని కలిసాము
హాయిగా ఆటాడుకున్నాము

కాళ్ళకు చక్రాలు కట్టాము
ఊరు మొత్తం తిరిగాము
చాలా అలసిపోయాము
బాగా తిని బజ్జున్నాము

తెలతెలవారగా లేచాము
దినపత్రికలు చదివాము
లోకజ్ఞానం తెలుసుకున్నాము
విజ్ఞానంతో మసలుకున్నాము

పగలంతా హాయిగా వున్నాము
అలసటనే మరచిపోయాము
ఆహ్లాదంగా కాలం గడిపాము
ఉరకలు వేస్తూ కదిలాము


తీర్థయాత్రలకు వెళ్ళాము
గుడి గోపురాలను చూసాము
నచ్చిన ప్రదేశాలకు పోయాము
ఎంతెంతో తెలుసుకున్నాము

వేసవి విడిది ఆహ్లాదం
స్వేచ్ఛకు అది ప్రతిరూపం
పిల్ల పాపల కేరింతలకు
వేసవి కాలం ఉత్సాహం!

- నరెడ్డుల రాజారెడ్డి,
96660 16636.

బొమ్మరిల్లు







ఎల్.మధు హాసిని,
8వ తరగతి,
అభ్యాస విద్యాలయం,
గుణదల, విజయవాడ.





ఎస్.బి.వర్షిణి,
2వ తరగతి,
డి.ఎ.వి హైస్కూలు, వేములూరు,
కొవ్వూరు, తూర్పు గోదావరి జిల్లా.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా

వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.

మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com

– ఎడిటర్

చేజారి పోకుండా

JEEVANA జీవన the family

చేదోడుగా నిలవండి..!

ఉయ్యాలలో బిడ్డను పడుకోబెట్టిన తల్లి తరచూ ఆ వైపే చూస్తూ ఉంటుంది. బిడ్డ ఎక్కడ కింద పడిపోతాడేమోనన్న బెంగ ఆమెని స్థిమితంగా ఉండనీయదు. సైకిల్ నేర్చుకుంటానని బయటికి వెళ్లిన చిన్నారికి నాన్న ఎన్నో జాగ్రత్తలు చెప్పి మరీ పంపిస్తాడు. బుడి బుడి అడుగులు వెయ్యడం మొదలుపెట్టినప్పటి నుండే పిల్లల చుట్టూ రక్షణ వలయం ఏర్పరుస్తాం. మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవ్వాలని, పిల్లల ఊహాప్రపంచం పెరగాలని ఎంతోమంది తల్లిదండ్రులు ఎన్నెన్నో నీతి కథలు చెబుతారు. బుద్ధి, జ్ఞానం పెరగాలని ఎన్నో సుద్దులు వల్లె వేయిస్తారు. కానీ ఇప్పుడు కాలం మారింది. మనం చూస్తుండగానే పిల్లల ప్రపంచం ఎంతో విస్తృతమైంది. అందులో ఎన్నో అగాధాలు, మరెన్నో ఎత్తుపల్లాలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏది నిజం? ఏది అబద్ధమో తెలిసీ తెలియని వయసులో నేరాలకు పాల్పడడమో, నేరాలకు గురవ్వడమో చేస్తున్నారు. ఈ తీవ్రత ఎంత అధికంగా ఉంటుందంటే కన్నవాళ్లను కడుపుకోతకు గురిచేసి, అనంత దుఃఖ సాగరంలో ముంచేంత!



ఒకప్పుడైతే యుక్త వయసు వచ్చాకే పిల్లల ప్రపంచం పెద్దదవుతుందని భావించాం. కానీ, ప్రస్తుతం మారిన కాలంలో, జోగాడే వయసు నుండే పిల్లల ప్రపంచం పెద్దదవుతూ వస్తోంది. ఊహ తెలియక ముందు నుండే కార్టూన్ బొమ్మలకు అలవాటు పడిన పిల్లలు, ఆ బొమ్మల్లాగా ఎగరాలని కలలు కంటున్నారు. ఆ వీడియోలో చూపించినట్లు సాహసాలు చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా వదిలిపెట్టకుండా తమను ప్రభావితం చేసిన అంశాలను ఆచరణలో పెట్టేస్తున్నారు.

'ప్రజలు ప్రమాదంలో ఉన్నప్పుడు ఫలానా పాత్రధారి వాళ్లని కాపాడేస్తాడు. నీళ్లలోంచి బయటికి తెచ్చేస్తాడు. అగ్ని ప్రమాదాల నుండి, జంతువుల నుండి, విలన్ల నుండి రక్షించేస్తాడు' అన్న భావన వారి చుట్టూ తిరుగుతుంటుంది. ఆ భ్రమ వాళ్లని చాలా కాలం వెంటాడుతుంది. ఆ పాత్ర హీరోయిజాన్ని తరచూ వాళ్ల స్నేహితులతో ముచ్చటిస్తూ ఉంటారు. ఆ పాత్ర ప్రభావం వారిని ఎంతలా ప్రభావితం చేస్తుందంటే, ఆ పాత్రలో తమను తాము ఊహించుకుంటారు. ఆ పాత్ర ఏది చేస్తే వాళ్లూ అదే చేయాలని అనుకుంటారు.

బాల్యంలో నాటుకుపోయిన ఈ ధోరణి కౌమార దశకు వచ్చేసరికి వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. 'ఏదైనా చేయగలం, చేసేయగలం' అన్న సొంత నిర్ణయాలు తీసుకునే స్థాయికి తెచ్చేస్తుంది. ఆ భావన ఇప్పటి పిల్లల్లో బాగా పెరిగిపోయింది. పిల్లలు దురలవాట్లకూ అలవాటుపడ్డా, ప్రమాదాలకు కారణమవుతున్నా ఈ భావనే పనిచేస్తోంది. పిల్లలు ఈ భావన నుంచి దూరంగా రావాలంటే తల్లిదండ్రులుగా మనం ఏం చేయాలి?

పిల్లలు కొన్ని విషయాలు మాత్రమే మనం చెప్పినవి చేస్తారు. చాలా విషయాలు వాళ్లంతట వాళ్లే నేర్చుకుంటారు. మంచం మీద నుండి కిందకి జారిపోయే బిడ్డను పట్టుకోవాలని పరుగెత్తేలోపు, దుప్పటి గట్టిగా పట్టుకుని కిందకు పడిపోకుండా పిల్లలు తమను తాము రక్షించుకుంటారు. నీళ్లు ఉన్నాయని, గొయ్యి ఉందని దాటుకుని వచ్చే పిల్లలు కూడా ఉంటారు. బాల్యంలో ఇంత జాగ్రత్త పాటించే పిల్లలు కౌమారం వచ్చేసరికి ఎందుకు ప్రమాదాలకు గురవుతారు? ఇతరులకు హానీ కలిగించేలా, ప్రమాదాలకు కారణమయ్యేలా ఎందుకు ప్రవర్తిస్తున్నారు?

ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలన్నా, ప్రమాదాల నుండి బయటపడాలన్నా, ప్రమాదాల తీవ్రత తెలియాలన్నా ప్రతిదీ పిల్లలకు అవగాహన కల్పించాలి. ఆ బాధ్యత ప్రతి తల్లిదీ, తండ్రిదీ. పిల్లల చుట్టూ ఆ వాతావరణం కల్పించడంలో అమ్మానాన్న ఎంతో శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా కౌమారంలోకి వచ్చిన పిల్లలు వాస్తవానికి, భ్రమకి మధ్య ఊగిసలాడుతూ ఉంటారు. నీళ్లు, నిప్పు, మరే ఇతర ప్రమాదాలు వాళ్లకి ప్రమాదాలుగా కనిపించవు. అందుకే నీళ్ల సంపులో దిగి ప్రాణాలు కోల్పోతారు. డాబా మీద నుండి కింద పడిపోతారు. విద్యుద్ఘాతానికి గురవుతారు. పదునైన వస్తువులతో గాయాలు చేసుకుంటారు. అగ్నిప్రమాదాలకు గురవుతుంటారు. వాళ్లకు వాళ్లు ప్రమాదాలకు గురవ్వడం ఒక ఎత్తయితే, నిర్లక్ష్యంగా వ్యవహరించి వేరొకరి ప్రాణాలు పోవడానికి కూడా కారకులవుతారు. పిల్లలు నేరాలకు గురైనా, నేరాలు చేసినా తప్పు వారిది కాదు.

ఇటీవల కాలంలో పిల్లలు చేసిన తప్పులకు శిక్షగా వాళ్లల్లో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంగా న్యాయస్థానాలు తీర్పులు ఇస్తున్నాయి. తప్పు చేసిన పిల్లలు ఆ తప్పు ఎందుకు చేశాం? ఎలా జరిగింది? ఎవరు ప్రభావితమయ్యారు? అనే విషయాలు పునరావలోకనం చేసుకునేలా శిక్షలు వేస్తున్న న్యాయస్థానాల తీరు గమనించదగ్గది.

మే 19 (ఆదివారం)న పూణెలో ఒక మైనర్ బాలుడు మద్యం సేవించి కారు నడిపిన ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. ఈ కేసులో ఆ బాలుడికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ఆ సందర్భంలో కోర్టు పెట్టిన షరతులు చర్చనీయాంశమయ్యాయి.

జరిగిన ప్రమాదంపై వ్యాసం రాయాలని కోర్టు ఆ పిల్లవాడిని ఆదేశించింది. 15 రోజుల పాటు ట్రాఫిక్ పోలీసులతో కలిసి పనిచేయాలని నిర్దేశించింది. మానసిక నిపుణుడి వద్ద చికిత్స తీసుకోవాలని సూచించింది. ఇంకా భవిష్యత్తులో ఎవరైనా రోడ్డు ప్రమాదాలకు గురైతే ఆ బాధితులకు సాయం చేయాలని చెప్పింది. ఇవన్నీ చదువుతున్నప్పుడు వీటిని శిక్షలంటారా? అని అనిపించవచ్చు. కానీ ఇక్కడ ఉద్దేశం పిల్లల్లో పరివర్తన రావాలి. చనిపోయిన ఆ యువకుల ప్రాణాలు తిరిగి రావు. కానీ నేరం చేసిన పిల్లవాడిలో పరివర్తన రాకపోతే ముందుముందు మరెన్నో ప్రమాదాలకు కారణమవుతాడు. శిక్ష ఉద్దేశం, నేరస్తుడిలో పరివర్తన రావడమని కోర్టు మరోసారి నిరూపించింది. ముఖ్యంగా మైనర్లల్లో పెరిగిపోతున్న నేర స్వభావాన్ని నియంత్రించాలంటే వారిని శిక్షించడంపై దృష్టి పెట్టకుండా, ప్రవర్తనలో మార్పు తేవాలని అర్థమయ్యేలా చేసింది.

ఆగస్టు నుంచి 'ఎన్టీఆర్ నీల్' షూటింగ్



డైరెక్టర్ ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రానున్న సినిమా 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఎన్టీఆర్ ప్రస్తుతం నటిస్తున్న దేవర, వార్2 సినిమాలు పూర్తయ్యాక– ఈ మూవీ చిత్రీకరణ ఆగస్టులో ప్రారంభించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సోమవారంనాడు తారక్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ అప్‌డేట్‌ను ఇచ్చారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్రస్తుతం స్క్రిప్ట్ తయారీ పనుల్లో ఉన్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై ఈ సినిమా రూపొందనుంది.

'మిరాయ్' అలరిస్తుంది : మనోజ్



'ఇంతటి పవర్‌ఫుల్, ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్‌తో మళ్లీ ఇండస్ట్రీకి రావడం చాలెంజింగ్ గానూ, ఎగ్జైటింగ్‌గానూ ఉంది. నా రాక కోసం ఎదురుచూస్తున్న నా అభిమానులతో ఈ ప్రయాణాన్ని పంచుకోవడానికి నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను. నెరటివ్–రిచ్ వరల్డ్ నేపథ్యంలో మిరాయ్ సినిమా అద్భుతంగా ఉంటుంది. ఇది చరిత్ర, పురాణాలతో కూడిన కథ.' అని నటుడు మనోజ్ మంచు అన్నారు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత 'మిరాయ్' చిత్రం ద్వారా ఆయన వెండితెరపై కన్పించబోతున్నారు. తేజ సజ్జా ది సూపర్ యోధగా నటిస్తున్న ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. మనోజ్ మంచు పుట్టినరోజు సందర్భంగా ది బ్లాక్ స్వోర్డ్‌గా ఫస్ట్ లుక్ గ్లింప్‌ను సోమవారం మేకర్లు విడుదల చేశారు.



ఆ పార్టీతో నాకు సంబంధం లేదు


బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని సినీనటి హేమ అన్నారు. దీనిపై ఆమె ప్రత్యేక వీడియో విడుదల చేశారు. 'నేను ఎక్కడకూ వెళ్లలేదు. హైదరాబాద్‌లోనే ఉన్నాను. నాపై సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు నమ్మకండి.' అని విజ్ఞప్తి చేశారు. బెంగుళూరు శివారులో ఓ ఫామ్ హౌస్‌లో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడినట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో హేమ ఈ ప్రకటన చేశారు.

'సినిమా ప్రపంచం అంతా అబద్ధం'



'నేను ఎంపీగా గెలిస్తే సినిమాలకు గుడ్‌బై చెప్తాను. ఈ సినీ ప్రపంచం అనేది ఒక అబద్ధం. కనిపించేంత అందంగా, వాస్తవికంగా ఉండదు. పైగా నాకు ఒకే పని ఎక్కువకాలం చేయాలనిపించదు.' అని బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ చెప్పారు. ప్రస్తుతం ఆమె హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యలు చేశారు. ఆమె దర్శకత్వం వహించిన ఎమర్జెన్సీ చిత్రం త్వరలోనే విడుదల కానుంది.

హిందీ చిత్రంలో అజయ్



టాలీవుడ్ నటుడు అజయ్ బాలీవుడ్ హీరో అజయ్ దేవగణ్ నటిస్తోన్న సింగం3 సినిమాలో నటిస్తున్నారు. ఇప్పటికే రెండు భాగాలుగా వచ్చిన ఈ సింగం సినిమా బాలీవుడ్‌లో రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. ఇప్పుడు మూడో భాగం షూటింగ్ జరుగుతోంది. రోహిత్ షెట్టి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ నుండి కొన్ని ఫొటోలు విడుదలయ్యాయి. అజయ్ దేవగణ్‌తో కలిసి అజయ్ దిగిన ఫొటో బయటకు రావడంతో ఆయన అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

24న బిగ్ బ్రదర్ విడుదల

శివ కంఠంనేని, ప్రియా హెగ్డే ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన చిత్రం బిగ్ బ్రదర్. గోసంగి సుబ్బారావు దర్శకత్వంలో ఈ సినిమాను రూపొందించారు. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకర్ రావు, ఆర్.వెంకటేశ్వరరావు సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రీ–రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, అశోక్ కుమార్, నిర్మాతల మండలి అధ్యక్షులు దామోదర్ ప్రసాద్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు పాల్గొన్నారు. బిగ్ బ్రదర్ మూవీతో హీరో శివ కంఠంనేని బ్లాక్ బస్టర్ హిట్ కొట్టాలని మురళీమోహన్ ఆకాంక్షించారు.



రైజర్స్‌తో రైడర్స్ సై

ఐపిఎల్ చరిత్రలో బ్యాటింగ్ రికార్డులను ఒక్క సీజన్‌లో తిరగరాసిన జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్. 277, 287, 266 భారీ స్కోర్లతో ప్రత్యర్థులకు చుక్కలు చూపించింది. పవర్‌ప్లేలోనే 125 పరుగులు దంచికొట్టిన ప్రపంచ టీ20 క్రికెట్‌లోనే సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఆకాశమూ హద్దు కాదు అంటూ విధ్వంసం సృష్టిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు అదే స్థాయిలో పోటీ ఇవ్వగల ఏకైక జట్టు కోల్‌కత నైట్‌రైడర్స్. ఈ సీజన్లో కోల్‌కత సైతం 272, 262 భారీ స్కోర్లతో చెలరేగింది.
ఐపిఎల్ 2024 బ్యాటింగ్‌లో మేటీ జట్లు నేడు క్వాలిఫయర్ 1లో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాయి. సునీల్ నరైన్, రింకూ సింగ్, అండ్రీ రసెల్ త్రయానికి గట్టి పంచ్ ఇచ్చేందుకు సన్‌రైజర్స్ ఫైర్ బ్రాండ్స్ ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్‌లు సిద్ధమవుతున్నారు. ఊచకోతకు మారుపేరుగా నిలిచిన సన్‌రైజర్స్, నైట్‌రైడర్స్ నేడు మొతెరాలో పరుగుల సునామీకి రంగం సిద్ధం చేసుకున్నాయి. ఐపిఎల్ 17వ సీజన్ తొలి క్వాలిఫయర్ పోరు నేడు.

- నేడు ఐపిఎల్ తొలి క్వాలిఫయర్ పోరు
- ఫైనల్లో చోటు కోసం తొలి ప్రయత్నం
- మొతెరాలో హైదరాబాద్, కోల్‌కత ఢీ
- రాత్రి 7-30 గంటల నుంచి





అహ్మదాబాద్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) గ్రూప్ దశ సమరం ముగిసింది. నేడు మొతెరా వేదికగా ప్లే ఆఫ్స్ అంకానికి తెర లేవనుంది. గ్రూప్ దశ అనంతరం పాయింట్ల పట్టికలో టాప్–2 స్థానాల్లో నిలిచిన జట్లు నేడు తొలి క్వాలిఫయర్ పోరులో ఢీకొట్టనున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కోల్‌కత నైట్‌రైడర్స్ నేడు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. గ్రూప్ దశ తొలి మ్యాచ్‌లో తలపడిన ఈ రెండు జట్లు మళ్లీ ఇప్పుడు క్వాలిఫయర్‌లోనే కయ్యానికి దిగుతున్నాయి. విధ్వంసక బ్యాటర్లు, నిప్పులు చెరిగే పేసర్లు, మాయ చేయగల స్పిన్నర్లతో ఇటు సన్‌రైజర్స్, అటు నైట్‌రైడర్స్ శిబిరం విజయంపై దీమాగా కనిపిస్తున్నాయి. పరుగుల వరదగా భావిస్తున్న మహా పోరులో ఎవరు పైచేయి సాధిస్తారనేది ఆసక్తికరం. క్వాలిఫయర్ 1లో నెగ్గిన జట్టు నేరుగా టైటిల్ పోరుకు చేరుకుంటుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు క్వాలిఫయర్ 2 రూపంలో ఫైనల్స్‌కు చేరుకునేందుకు మరో అవకాశం దక్కించుకోనుంది. ఎలిమినేటర్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, రాజస్థాన్ రాయల్స్ తలపడనున్న సంగతి తెలిసిందే.

సన్‌రైజర్స్‌కు ఎదురుందా? : సన్‌రైజర్స్ అంటే ఫ్లవర్ కాదు ఫైర్ అని నిరూపించింది పాట్ కమిన్స్ సేన. పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను లాగేసుకునే వ్యూహం ఆరెంజ్ ఆర్మీకి బాగా కలిసొచ్చింది. భారీ స్కోర్లు బాదటమే కాదు లక్ష్యాలను కాపాడుకోగలమని హైదరాబాద్ నిరూపించింది. గ్రూప్ దశ చివరి మ్యాచుల్లో బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ విభాగాన్ని సైతం పటిష్టం చేసుకుంది. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మలు ఆకాశమే హద్దుగా చెలరేగుతుంటే.. ఇప్పుడు రాహుల్ త్రిపాఠి రూపంలో మరో హిట్టర్ టాప్ ఆర్డర్‌లో చేరాడు. నితీశ్ కుమార్ రెడ్డి, షాబాజ్ అహ్మద్, అబ్దుల్ సమద్ తోడుగా హెన్రిచ్ క్లాసెన్ ద్వితీయార్థం ఓవర్లలో ఊచకోత ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. కోల్‌కతతో తొలి మ్యాచ్‌లో ట్రావిశ్ హెడ్ ఆడలేదు. ఈ మ్యాచ్‌లో హెడ్‌ను నైట్‌రైడర్స్ ఏ విధంగా అడ్డుకుంటుందో చూడాలి. భువనేశ్వర్ కుమార్, నటరాజన్ ఫామ్ అందుకున్నారు. యార్కర్లు సంధిస్తూ అదరగొడుతున్నారు. నటరాజన్ స్లో బౌన్సర్‌ను సైతం అమ్ములపొదిలో చేర్చాడు. పాట్ కమిన్స్ మిడిల్ ఓవర్లలో స్పిన్ ద్వయంతో కలిసి బ్యాటర్లను కట్టడి చేస్తున్నాడు. మూడు రంగాల్లోనూ దీటుగా ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను అడ్డుకోవటం కోల్‌కత నైట్‌రైడర్స్‌కు శక్తికి మించిన పనే!.

కోల్‌కత దూకుడు : శ్రేయస్ సారథ్యం, గంభీర్ వ్యూహ చతురత ఈ సీజన్‌లో నైట్‌రైడర్స్‌ను సరికొత్తగా ఆవిష్కరించింది. గ్రూప్ దశలో 12 మ్యాచుల్లోనే నైట్‌రైడర్స్ ప్లే ఆఫ్స్ బెర్త్ సాధించింది. ఆ జట్టు ఆడాల్సిన గ్రూప్ దశ చివరి రెండు మ్యాచులు వర్షార్పణం కావటం కాస్త ప్రతికూలం. ముంబయి ఇండియన్స్‌తో మ్యాచ్ తర్వాత కోల్‌కత మళ్లీ ఆడలేదు. సుమారు పది రోజుల విరామం తర్వాత క్వాలిఫయర్ 1 పోరుకు రానుండటం అయ్యర్ సేనపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ సేవలు కోల్పోయినా.. సునీల్ నరైన్, వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్ ఫామ్‌లో ఉన్నారు. ఈ సీజన్లో రింకూ సింగ్ తనదైన మెరుపులు చూపించలేదు. ప్లే ఆఫ్స్‌లో అతడు విజృంభిస్తే సన్‌రైజర్స్‌కు కష్టాలు తప్పవు. అండ్రీ రసెల్‌ను కట్టడి చేయటంపై సన్‌రైజర్స్ బౌలర్లు సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక కోల్‌కత బౌలింగ్‌లో స్పిన్నర్లు మినహా పేసర్లు సన్‌రైజర్స్‌కు దీటుగా కనిపించటం లేదు. సన్‌రైజర్స్ బ్యాటర్ల ముంగిట పేసర్లు తలొంచే ప్రమాదం లేకపోలేదు.

స్పిన్ ఫ్యాక్టర్ : ఐపిఎల్ 17లో కోల్‌కత, హైదరాబాద్ తలపడిన తొలి మ్యాచ్ ఆఖరు ఓవర్ ఉత్కంఠకు దారితీసింది. ఆ మ్యాచ్‌లో నైట్‌రైడర్స్ 4 పరుగుల తేడాతో గట్టెక్కింది. నేడు మొతెరాలో ఏ పిచ్ ఎదురైనా స్పిన్నర్లు కీలక పాత్ర పోషించనున్నారు. కోల్‌కతకు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి రూపంలో ఇద్దరు నాణ్యమైన మాయగాళ్లు ఉన్నారు. సన్‌రైజర్స్ శిబిరంలో శ్రీలంక మాయగాడు విజయకాంత్ గత రెండు మ్యాచుల్లో మెప్పించాడు. షాబాజ్ అహ్మద్‌తో కలిసి స్పిన్ బాధ్యతలు చూస్తున్నాడు. పేస్ విభాగంలో పాట్ కమిన్స్, భువనేశ్వర్ కుమార్, నటరాజన్ త్రయం.. మిచెల్ స్టార్క్, హర్షిత్ రానా, అనుకూల్ రాయ్ కంటే మెరుగ్గా కనిపిస్తుండగా... స్పిన్ విభాగంలో నైట్‌రైడర్స్ పైచేయి సుస్పష్టం!.

పిచ్ రిపోర్టు : మొతెరా స్టేడియంలో రెండు రకాల పిచ్‌లు ఉన్నాయి. బ్యాటర్ల స్వర్గధామం ఎర్ర మట్టితో చేసిన పిచ్. స్పిన్నర్ల మాయాలోకం నల్లమట్టితో తయారు చేసిన పిచ్. ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ల నిర్వహణ, పిచ్‌ల ఎంపిక నేరుగా బీసీసీఐ పర్యవేక్షిస్తుంది. దీంతో పరుగుల వరద పారే ఎర్రమట్టి పిచ్‌ను ఎంచుకునే అవకాశం ఎక్కువ. సన్‌రైజర్స్, నైట్‌రైడర్స్ బ్యాటింగ్ పిచ్‌నే కోరుకుంటున్నాయి. టాస్ నెగ్గిన తొలుత బ్యాటింగ్ ఎంచుకునే వీలుంది. క్వాలిఫయర్ 1 పోరుకు వర్షం సూచనలు లేవు.

తుది జట్లు (అంచనా) :

సన్‌రైజర్స్ హైదరాబాద్ : ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్ (వికెట్ కీపర్), షాబాజ్ అహ్మద్, అబ్దుల్ సమద్, సన్వీర్ సింగ్, పాట్ కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్ కుమార్, విజయకాంత్, టి నటరాజన్.

కోల్‌కత నైట్‌రైడర్స్ : సునీల్ నరైన్, రెహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వెంకటేశ్ అయ్యర్, నితీశ్ రానా, రింకూ సింగ్, అండ్రీ రసెల్, రమణ్‌దీప్ సింగ్, మిచెల్ స్టార్క్, అనుకూల్ రాయ్, హర్షిత్ రానా, వరుణ్ చక్రవర్తి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68